https://www.sreechakranews.com



# శ్రీచక్ర



SREECHAKRA TELUGU DAILY

సంపుటి 7 | సంచిక 223 | కర్నూలు | శుక్రవారం, 29 డిసెంబర్ 2023 | పేజీలు 9 | వెల రూ. 5,00

Published from Kurnool | Vijayawada | Ananthapuramu | Kadapa | Chittoor | Nellore | Prakasham | East Godavari | West Godavari | Hyderabad

# భారత్ న్యాయయాత్ర

● మణిపూర్ టూ ముంబయి

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి యాత్ర చేపట్టనున్నారు. ఈసారి 'భారత్ న్యాయ యాత్ర' పేరిట ఈశాన్య రాష్ట్రం మణిపూర్ నుంచి ప్రారంభించి పశ్చిమ తీరం వరకూ యాత్ర సాగనుంది. జనవరి 14న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే జెండా ఊపి ఈ యాత్రను ప్రారంభించనున్నారు. మార్చి 20న ముంబయిలో ముగియనుంది. 14 రాష్ట్రాల్లో 85 జిల్లాల మీదుగా 6,200 కిలో మీటర్లు సాగనున్న ఈ యాత్రను రాహుల్ గాంధీ వినూత్న తరహాలో నిర్వహించనున్నారు. బస్ ద్వారా, అక్కడక్కడా కాలినడకన రాహుల్ భారత్ న్యాయ యాత్ర సాగనుంది. ఇది రాజకీయ యాత్ర కాదని, రాజకీయ ప్రయోజనాలు ఆశించడం లేదని ఏఐసీసీ ఆర్గనైజేషన్ ఇన్‌చార్జ్ జనరల్ సెక్రటరీ కెసి వేణుగోపాల్, కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్ తెలిపారు. దేశ ప్రజలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం కోసం ఈ యాత్ర సాగుతుందని అన్నారు. డిసెంబర్ 21 న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఏకగ్రీవ తీర్మానం ప్రకారం రాహుల్ గాంధీ రెండో దశ యాత్ర జరుగుతుందని తెలిపారు. మణిపూర్ ప్రజల గాయాలను నయం చేసే ప్రక్రియలో భాగంగా ఈ యాత్ర ప్రారంభించాలని ఆయన అన్నారు. మొదటి దశలో రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 12 రాష్ట్రాలను కవర్ చేస్తూ దాదాపు 4,500 కిలోమీటర్లు ప్రయాణించగా, ఈసారి 14 రాష్ట్రాలను కవర్ చేస్తూ 6,200 కిలోమీటర్లు ప్రయాణించనున్నారని తెలిపారు. యాత్ర మణిపూర్,





నాగాలాండ్, అస్సాం, మేఘాలయ, పశ్చిమ బెంగాల్, బీహార్, జార?ండ్, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్రలో సాగనుందన్నారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ ఆర్థిక అసమానతలు, మతోన్మాదం, నియంతత్వం వంటి అంశాలను లేవనెత్తగా, న్యాయ యాత్ర దేశ ప్రజలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయంపై దృష్టిసారిస్తుందని తెలిపారు.భారత్ జోడో యాత్రతో ఐక్యత, ప్రేమ, సామరస్య సందేశాన్ని వ్యాప్తి చేసిన రాహుల్ గాంధీ ఈ యాత్ర ద్వారా దేశ ప్రజలకు న్యాయం కోరుతారని అన్నారు.

## బంధిపోటుల భీకర కాల్పులు..



**నైజీరియా :** సెంట్రల్ నైజీరియాలో బంధిపోట్లు రెచ్చిపోయారు. గ్రామాల్లో తుపాకులు పట్టుకుని విధ్వంసం సృష్టించారు. ఈ దుర్ఘటనలో 160 మంది ప్రాణాలు కోల్పోయారు. 300 మందికి పైగా తీవ్ర గాయాల పాలయ్యారు. మతం, జాతి పరమైన విబేధాలు, ఘర్షణలతో సెంట్రల్ నైజీరియా గత కొన్నేండ్లుగా అట్టుడికిపోతున్నది. సెంట్రల్ నైజీరియాలో ఆయుధాలతో బంధిపోట్లు గ్రామాలపై విరుచుకుపడ్డారు. కనిపించిన వారిని కాల్చిపడేశారు. పలు గ్రామాల్లో బంధిపోట్లు నరమేధం సృష్టించారు. గ్రామాలపై దాడులు చేస్తున్న బంధిపోట్ల కాల్పుల్లో ఇప్పటివరకు మొత్తం 160 మంది మృత్యువాత పడినట్టు స్థానిక ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. బండిట్స్‌గా పిలిచే సైనిక గుంపులు.. కొన్ని తెగలకు చెందిన ప్రజలను లక్ష్యంగా చేస్తూ దాడులు చేస్తున్నారు. ఇక మధ్య నైజీరియా, వాయువ్య నైజీరియాలో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతూ ఉంటాయి. ఇండ్లలోకి చొరబడి ప్రజలను తీవ్ర చిత్రహింసలు పెట్టాయి. ఈ క్రమంలోనే ఆదివారం సాయంత్రం జరిగిన కాల్పుల్లో మొదట 16 మంది మాత్రమే మృతి చెందినట్టు వార్తలొచ్చాయి. అయితే ఆ తర్వాత మరింత రెచ్చిపోయిన బంధిపోట్లు.. మారణకాండ సృష్టించారు. సోమవారం కూడా దాడులు కొనసాగడంతో మృతుల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. దీంతో మొత్తం 160 మంది మృత్యువాత పడ్డారు. ఈ దుర్ఘటనలో మరో 300 మందికిపైగా తీవ్రంగా గాయపడినట్టు ప్రభుత్వం వెల్లడించింది. గాయపడిన వారిని దగ్గర్లోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందించినట్టు అధికారులు తెలిపారు. కొన్నేళ్లుగా ఈ ప్రాంతాల్లో మతపరమైన, సామాజిక పరమైన విబేధాల వల్ల ఘర్షణలు జరుగుతున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే తాజాగా సాయుధ మూకలు కాల్పులకు తెగబడ్డాయి.

## వైకాపా సినిమా మరో వందరోజులే

● వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమే
● కుప్పం పర్యటనలో చంద్రబాబు

**కుప్పం, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :** వైకాపా సినిమా అయిపోయింది.. ఇంకా 100 రోజులే మిగిలిందని తెదేపా అధినేత చంద్రబాబు ఎద్దేవా చేశారు. కుప్పం నియోజకవర్గం పరిధిలోని గుడుపల్లిలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కుప్పం నాకు సొంత కుటుంబం లాంటిది. ఈసారి కుప్పంలో లక్ష ఓట్ల మెజార్టీతో గెలవబోతున్నాం. గుడుపల్లి నాకు గుండె లాంటిందని అన్నారు. 'బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా ప్రకటించిన 'సూపర్ సిక్స్' హామీలు అమలు చేసే బాధ్యత నాది. ప్రతి ఇంటికీ రెండు ఆవులు ఉంటే మంచిదని ఆనాడే చెప్పా. ఆవులు పెంచడం ఏంటని అప్పుడు నన్ను ఎగతాళి చేశారు. పాడిని ఒక పరిశ్రమగా చేసి మీ జీవితాల్లో వెలుగులు తీసుకొస్తా. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తాం. నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు ఇస్తాం. యువత ఇంట్లో కూర్చుంటే మార్పు రాదు. 100 రోజులు నా కోసం, మీ కోసం పనిచేయండి. మీ జీవితాలు మార్చే బాధ్యత తెదేపా, జనసేన తీసుకుంటుంది. మీ భవిష్యత్ మీ చేతుల్లోనే ఉంది. యువతకు ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తెదేపా-జనసేన తీసుకుంటుంది. నాలాంటి వాడికే రక్షణ లేకుంటే సామాన్యుడి పరిస్థితి ఏంటి? ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి పోలీసులు ముందుకు రావాలి. పోలీసులు ఈసీ కింద పనిచేస్తున్నారు.. జగన్ కింద కాదు' అని చంద్రబాబు అన్నారు.

## అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలి

● విశ్వసనీయతకు మారుపేరుగా వైసీపీ నిలుస్తోంది
● ప్రభుత్వ కార్యక్రమాల్లో పొరపాట్లకు తావీయరాదు
● ప్రతిష్టాత్మకంగా పెన్షన్లు, చేయూత, అంబేడ్కర్ విగ్రహావిష్కరణ
● కలెక్టర్లతో సమీక్షించిన సీఎం జగన్





అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని, విశ్వసనీయతకు మారుపేరుగా వైసిపి ఉండాలని సిఎం జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, వారికి దిశానిర్దేశం చేశారు. వైయస్సార్ పెన్షన్ కానుక, వైయస్సార్ ఆసరా, వైయస్సార్ చేయూత, అంబేద్కర్ విగ్రహం ప్రారంభోత్సవం తదితర కార్యక్రమాలపై కలెక్టర్లతో చర్చించారు. - శ్రీచక్ర, అమరావతి

## 17వరోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

● పోస్టుకార్డు ఉద్యమం చేపట్టిన మహిళలు
● కోనసీమ జిల్లాలో ముగ్గిరిని సస్పెండ్ చేసిన అధికారులు

**కోనసీమ, డిసెంబర్ 28(శ్రీచక్ర) :** సమ్మెబాట పట్టిన వాలంటీర్లపై జగన్ సర్కార్ ఉక్కుపాదం మోపుతోంది. సమ్మెకు దిగిన వాలంటీర్లను సర్వీస్ నుంచి టెర్మినేట్ చేయాలని సర్కార్ నిర్ణయించింది. కోనసీమ జిల్లా అమలాపురం మున్సిపాలిటీలో బుధవారం సమ్మెకు దిగిన 18 మంది వాలంటీర్లలో ముగ్గురిని తప్పించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ అయ్యాయి. మరికొందరిని తప్పించడానికి అధికారుల అడుగులు వేస్తున్నారు. ఎవరు సమ్మె చేసినా ఊరుకోవద్దని అమలాపురం మున్సిపల్ కమిషనర్ ఆడియో మెసేజ్‌లో ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ తీరు పట్ల వాలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మె గురువారం నాటికి 17వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె శిబిరంలో అంగన్వాడీలు మెడకు ఉరి తాళ్ళు బిగించుకొని నిరసన తెలిపారు.

2



## పలు విమానాశ్రయాలకు బెదరింపులు

● అప్రమత్తమై అధికారుల తనిఖీలు

**న్యూఢిల్లీ :** దేశంలో పలు విమానాశ్రయాలకు బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపింది. దేశరాజధాని ఢిల్లీ సహా 7 విమానాశ్రయాలపై బాంబులు వేస్తామంటూ గుర్తుతెలియని వ్యక్తులు ఈ మెయిల్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. ఢిల్లీ, జైపూర్, లక్నో, చండీగఢ్, ముంబై, చెన్నై, అమ్మదాబాద్ ఎయిర్‌పోర్టులపై బాంబు దాడి చేయబోతున్నట్లు ఈమెయిల్ ద్వారా బెదిరించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. బుధవారం రాత్రి 10:23 గంటల సమయంలో బెదిరింపు మెయిల్స్ వచ్చినట్లు పేర్కొన్నాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు స్థానిక పోలీసుల సాయంతో ఆయా విమానాశ్రయాల్లో తనిఖీలు చేపట్టారు. అయితే, ఎక్కడా ఎలాంటి పేలుడు పదార్థాలూ కనిపించలేదు. ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. కాగా, బుధవారం ముంబైలోని పలు బ్యాంకులకు బాంబు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకులకు ఖిలాఫత్ ఇండియా మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. ప్రైవేటు బ్యాంకులు ఆర్బీఐతో కలిసి భారీ కుంభకోణానికి పాల్పడ్డాయని.. ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కొందరు బ్యాంకు ఉన్నతాధికారులు, ప్రముఖ మంత్రుల పాత్ర ఉన్నదని పేర్కొన్నారు. ఆర్బీఐ గవర్నర్, ఆర్థిక మంత్రి రాజీనామా చేసి కుంభకోణంపై ప్రకటన చేయకుంటే ఒక దాని తర్వాత ఒకటి బాంబులు పేలుస్తామన్నారు. దీంతో పోలీసులు తనిఖీ దళాలతో సోదాలు చేశారు. అయితే ఎక్కడా ఎలాంటి పేలుడు పదార్థాలూ దొరకలేదు.

## సంపాదకీయం

# జడ్జీల నియామకంలో జాప్యమేల?

దేశంలో జడ్జీల కొరత తీవ్రంగా వుంది. కేసుల పరిష్కారానికి ఏళ్లకు ఏళ్లు గడుస్తున్నాయి. ఇటీవల పార్లమెంటులో కూడా జడ్జీల కొరత గురించి చర్చ జరిగింది. దేశంలోని కోర్టుల్లో సుమారు ఐదు కోట్ల కంటే ఎక్కువ కేసులు పెండింగ్‌లో వున్నాయని న్యాయశాఖ మంత్రి ఓ ప్రశ్నకు సమాధానం చెప్పారు. ప్రస్తుతం హైకోర్టుల్లో 31% జడ్జీల కొరత వుంటే, జిల్లా కోర్టుల్లో 21% జడ్జీల కొరత వుందని ఇటీవలే సుప్రీంకోర్టు ఒక నివేదికలో వెల్లడించింది. సుప్రీంకోర్టుకు చెందిన సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ ప్లానింగ్ అట్టడుగు వర్గాల వారికి ప్రాతినిధ్యం కల్పించాలని సిఫారసు చేసింది. అయితే 2018లో హైకోర్టులకు 650 మంది జడ్జీలను నియమిస్తే 492 మంది జనరల్ కేటగిరిలో నియమించారని నివేదికలో పేర్కొంది. సుప్రీంకోర్టు ఇటీవల స్టేట్ ఆఫ్ ది జ్యూడిషరీ పేరుతో ఒక నివేదిక విడుదల చేసింది. మౌలిక సదుపాయాలు, బడ్జెటింగ్, మానవ వనరులు ఐసిటి అంశాలను స్పృశించింది. ఈ నివేదికను సుప్రీం కోర్టు వెబ్‌సైట్ ఈ నెల 15న అప్‌లోడ్ చేశారు.

కాగా న్యాయవ్యవస్థలో అట్టడుగు వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా అధ్యయనం చేస్తారని కూడా నివేదికలో వివరించింది. రాజ్యాంగంలోని అధికరణలు 15, 16లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రభుత్వ సర్వీసుల్లో కొన్ని వర్గాలకు రిజర్వు చేయాలనే నిబంధన వుంది. ఉదాహరణకు షెడ్యూల్డ్ కాస్ట్ (ఎస్‌సి), షెడ్యూల్డ్ ట్రైబ్ (ఎస్‌టి), ఇతర వెనుకబడిన వర్గాలు (ఒబిసి)లకు, ఆర్థికంగా బలహీన వర్గాలకు (ఇడబ్ల్యుఎస్)లకు రిజర్వేషన్ కల్పించాలని రాజ్యాంగంలో ఖచ్చితమైన నిబంధన వుంది. ఇక జిల్లా స్థాయిలో జడ్జీల రిక్రూట్‌మెంట్‌లలో కూడా పైన తెలిపిన వర్గాల వారికి రిజర్వేషన్ కల్పించాల్సి వుంటుందని తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది.ఇదే నివేదికలో సివిల్ జడ్జీల రిక్రూట్‌మెంట్‌ల విషయానికి వస్తే (జూనియర్ డివిజన్) రిజర్వ్‌డ్ కేటగిరిలో ఆరు రాష్ట్రాలను తీసుకుంటే బీహార్, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లలో పెద్ద రిక్రూట్‌మెంట్లు జరగలేదు. ఈ రాష్ట్రాల్లో అట్టడుగు వర్గాలకు చెందిన జడ్జీల ఖాళీలు అలాగే వున్నాయి. పెద్ద సంఖ్యలో జడ్జీలను నియమించాల్సి ఉంది. తాజాగా విడుదల చేసిన ఐసిటి నివేదికలో పైన తెలిపిన ఆరు రాష్ట్రాల్లో సుమారు 1,389 సివిల్ జడ్జీలు (జూనియన్ డివిజన్) సీట్లు ఖాళీగా వున్నాయని ప్రకటనలు కూడా ఇచ్చారు.

దీనికి పరీక్షలు నిర్వహిస్తామని పత్రికా ప్రకటన ఇచ్చారు. వాటిలో 766 పోస్టులు రిజర్వు కేటగిరికి చెందినవి. వాటిలో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, ఇడబ్ల్యుసితో పాటు ఇతర కేటగిరిలకు సంబంధించినవి వున్నాయి. అయితే ఒక్కో రాష్ట్రంలో రిజర్వేషన్లు ఒక్కో విధంగా వుంటాయి. అయితే ఇప్పటి రిజర్వ్‌డ్ కేటగిరి విషయానికి వస్తే సుమారు 37.5 % సీట్లను ఇవే ఆరు రాష్ట్రాల్లో ఇప్పటికీ భర్తీ చేయనేలేదు. ఈ లెక్కన చూస్తే మొత్తం ఖాళీల విషయానికి వస్తే 66.3 శాతానికి చేరుకుంటాయి. చివరిగా సివిల్ జడ్జీలు అంటే జూనియర్ డివిజన్‌లో రిక్రూట్‌మెంట్ పరీక్ష తర్వాత ఈ ఖాళీలను పూరించలేదని నివేదకలో వివరించింది.పైన తెలిపిన ఆరు రాష్ట్రాల్లో ఎస్‌టి కేటగిరి కోసం రిజర్వు చేసిన 168 సీట్లకుగాను 142 సీట్లను ఇప్పటికీ భర్తీ చేయలేదు. అంటే 84.5% సీట్లు ఇప్పటికీ ఖాళీగానే వున్నాయి. దేశంలో పలు రాష్ట్రాల్లో గుట్టలు గుట్టలుగా పేరుకుపోతున్న కేసులు సత్వరం పరిష్కారానికి పెద్ద ఎత్తున జడ్జీలను నియమించాల్సి వుంటుంది. ముఖ్యంగా రిజర్వు కేటగిరిలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని నివేదికలో సూచించింది.

ఇక దేశ వ్యాప్తంగా చూస్తే 5,300 జడ్జీల కొరత ఉంది. ఇదే నివేదికలో హ్యూమన్ రీ సోర్సెస్ మేనేజ్‌మెంట్ దేశంలోని కోర్టుల్లో జడ్జీల కొరత తీవ్రంగా వుందని వెల్లడించింది. దేశ జనాభా విషయానికి వస్తే సుమారు 140.76 కోట్లు కాగా.. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 5.05 కోట్ల కేసులు పెండింగ్‌లో వున్నాయి. ఈ కేసులను పరిష్కరించడానికి దేశంలోని అన్నీ స్థాయిలో 20,850 మంది జడ్జీలున్నారు. కాగా ఈ ఏడాది అక్టోబర్ 1వ తేదీ నాటికి చూస్తే దేశంలోని హైకోర్టుల్లో 347 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంటే 31% జడ్జీ పోస్టులు ఖాళీగా వున్నట్లు లెక్క. కాగా మొత్తం జడ్జీల కేటాయింపు విషయానికి వస్తే 1,114 మంది. కాగా వాటిలో మూడో వంతు జడ్జీలు తక్కువగా వున్నారని నివేదికలో పేర్కొంది. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నాటికి చూస్తే జిల్లా స్థాయిలో జడ్జీల సంఖ్య 25,081 మంది వుండాలి.కాగా ప్రస్తుతం జిల్లా స్థాయిలో వున్న జడ్జీల సంఖ్య 19,781గా తేలింది. ఈ లెక్కన చూస్తే 5,300 మంది జడ్జీల కొరత వుంది. ఈ లెక్కన చూస్తే 21% మంది జడ్జీలు కొరత వున్నట్లు లెక్క. ఇక మహిళా జడ్జీల విషయానికి వస్తే పరిస్థితి ఏమంత సానుకూలంగా లేదు. జిల్లా స్థాయిలో మహిళా జడ్జీలు 36.3% ఉండాలి.అయితే ఎక్కడా మహిళా జడ్జీల ప్రాతినిధ్యం మాత్రం కనిపించడం లేదు.

అది సుప్రీం కోర్టు అయినా లేదా హైకోర్టుల్లో అయినా వారి ప్రాతినిధ్యం అంతంత మాత్రంగానే వుందని నివేదికలో వివరించింది. ఈ ఏడాది అక్టోబర్ 1వ తేదీ నాటికి సుప్రీం కోర్టులో కేవలం ముగ్గురు మాత్రమే మహిళా జడ్జీలు వున్నారు. వాస్తవానికి మహిళా జడ్జీల సంఖ్య 32 వుండాలి. ఇక దేశంలోని హైకోర్టుల విషయానికి వస్తే దేశ వ్యాప్తంగా 767 పర్మినెంట్, అదనపు జడ్జీలు వుండాలి. అయితే ప్రస్తుతం కేవలం 103 మంది మహిళా జడ్జీలు మాత్రమే వున్నారు. అంటే దేశ వ్యాప్తంగా వాస్తవంగా వుండాల్సిన సంఖ్య కంటే 13.42% మంది మాత్రమే పని చేస్తున్నట్లు భావించాల్సి వుంటుంది. జిల్లాలో జ్యుడిషియల్ ఆఫీసర్ల నియామకాల బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలది. ఆయా రాష్ట్రాల హైకోర్టులే దీనికి బాధ్యత వహించాలి. దేశంలోని పలు రాష్ట్రాల విషయానికి వస్తే ఆంధ్రప్రదేశ్, బీహార్, చత్తీస్‌గఢ్, కర్నాటక, ఒడిశా, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌లలో మాత్రం జ్యుడిషియల్ పరీక్షల్లో మహిళలకు రిజర్వేషన్లు వున్నాయి. దీంతో పాటు ప్రమోషన్లలో కూడా మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తున్నాయి. అయితే కాస్తా ఊరట కలిగించే అంశం ఏమిటంటే ఇటీవల కాలంలో జ్యుడిషియల్ వ్యవస్థలో మహిళా జడ్జీల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతుండడం శుభ పరిణామమే అని చెప్పుకోవచ్చు.

దేశంలోని 16 రాష్ట్రాల్లో సివిల్ జడ్జీల (జూనియర్ డివిజన్) రిక్రూట్ పరీక్షల చివరి ఫలితాలను బట్టి చూస్తే తెలుస్తోంది. ఈ పరీక్షా ఫలితాలను పరిగణనలోకి తీసుకుంటే జూనియర్ డివిజన్ సివిల్ జడ్జీల్లో 14 మంది మహిళా జడ్జీలను ఎంపిక చేశారు. అంటే 50% మంది జడ్జీలను ఎంపిక చేసినట్లు ఆ నివేదిక వివరించింది.ఇవన్నీ ఒక ఎత్తయితే దేశంలోని జ్యుడిషియరీ రంగంలో మౌలిక వసతుల కొరత వేధిస్తోంది. జిల్లా స్థాయిలో 25,081 మంది జడ్జీల నియామకాలకు అనుమతి లభిస్తే దేశ వ్యాప్తంగా 4,250 కోర్టుల రూముల కొరత వుంది. అలాగే జడ్జీలకు కావాల్సిన రెసిడెన్సియల్ యూనిట్లు నివాస గృహాల కొరత 6,021 వరకు వుందని నివేదికలో తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నాటికి చూసుకుంటే గత మూడు సంవత్సరాల నుంచి కోర్టు రూముల నిర్మాణం కొనసాగుతూనే వుంది. ఈ లెక్కన చూస్తే 42.9% కోర్టు రూములు నిర్మాణ దశలో వున్నట్లు లెక్క. ఇక మహారాష్ట్ర విషయానికి వస్తే జిల్లా స్థాయిలో కోర్టు రూములు పుష్కలంగా వున్నాయి. అలాగే జడ్జీలకు ఇళ్ల కొరత కూడా పెద్దగా లేదని చెప్పుకోవచ్చు. అలాగే జమ్మూకశ్మీర్, లడఖ్, త్రిపురలో కూడా గరిష్ఠంగా కోర్టు రూములున్నాయి. జడ్జీలకు కూడా కావాల్సినంత ఇల్లు అందుబాటులో వున్నాయని నివేదికలో వివరించింది. మొత్తానికి చూస్తే తాజా నివేదికలో దేశంలో జడ్జీల నియామకాల్లో రిజర్వేషన్లు అమలు చేయడం లేదని ప్రముఖంగా ప్రస్తావించింది. ఇప్పటికైనా ఎస్‌సి, ఎస్‌టిలకు, వెనుకబడిన వర్గాలకు జడ్జీలుగా అవకాశం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే వుంది.

# కేరళ గవర్నర్ నిరంకుశ పోకడలు

ప్రతిపక్షపాలిత రాష్ట్రాల్లోని గవర్నర్లు కేంద్రంలోని పాలక పార్టీ రాజకీయ ఎజెండాను ముందుకు తీసుకెళ్లే సాధనాలుగా వ్యవహరిస్తున్నారు. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యకలాపాలు నెరవేరకుండా ఇబ్బందులు పెట్టడమే పనిగా పెట్టుకున్నారు. కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ పాత్ర తీవ్ర విఘాతం కలిగించేదిగాను, అసహ్యకరంగాను ఉంది. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన ఎనిమిది బిలులను ఆయన ఆమోదం తెలపడం కానీ, బిల్లులను పున్ణ పరిశీలన కోసం అసెంబ్లీకి తిరిగి పంపడం కానీ చేయకుండా అలానే తొక్కిపట్టి ఉంచుతున్నారు. వీటిలో రెండు బిల్లులను రెండేళ్లుగా ఆయన వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. అసెంబ్లీ ఆమోదించిన బిలులను తొక్కిపట్టుకు కూర్చొన్న పంజాబ్ గవర్నర్ నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు స్పందిస్తూ, గవర్నర్‌కు అలాంటి హక్కు లేదని స్పష్టం చేసింది. ఇదే అంశంపై కేరళ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన కోర్టు, దీనిపై ఒక నివేదిక ఇవ్వాలని రాజ్‌భవన్ కార్యదర్శిని ఆదేశించింది. ఇంతలో గవర్నరు ఒక బిల్లుకు ఆమోదం తెలిపి, మిగతా ఏడు బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు పంపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 300 ప్రకారం, కొన్ని బిల్లులను మాత్రమే రాష్ట్రపతికి పంపవచ్చు కాబట్టి ఇది ఒక మోసపూరిత చర్య. ఈ బిల్లులను రాష్ట్రపతికి పంపడం ద్వారా, వాటిని శాశ్వతంగా పాతర వేయడానికి వీలు కల్పించడమే. రాష్ట్రపతికి నివేదించిన బిల్లులకు మోక్షం ఎప్పుడు లభిస్తుందో తెలీదు. ఇందుకు సంబంధించి రాజ్యాంగంలో నిర్దిష్ట కాలపరిమితి ఏదీ లేనందున వాటిని నిరవధికంగా నిలిపివేయబడతాయి.

ఇటువంటి చర్యల ద్వారా అసెంబ్లీ శాసన నిర్మాణ అధికారాలను అడ్డుకోవడంతో పాటు, ఖాన్ ఇప్పుడు ఆరెస్సెస్- బిజెపి సిబ్బందితో విశ్వవిద్యాలయ నిర్ణయాధికార సంస్థలను నింపేందుకు బరితెగించారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ హొదాలో గవర్నర్ విశ్వవిద్యాలయ సెనేట్‌లో నిర్దిష్ట సంఖ్యలో నామినేటెడ్ సీట్లను భర్తీ చేయాల్సి ఉంటుంది. కేరళ యూనివర్శిటీ విషయానికి వస్తే, 23 మంది నామినేటెడ్ సభ్యులలో, 17 మందిని ఛాన్సలర్, ఆరుగురిని రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేసింది. 17 నామినేటెడ్ సీట్లలో ఇద్దరు హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు, నలుగురు ప్రతిభావంతులైన విద్యార్థులు, పరిశోధనా సంస్థల ప్రతినిధులు, సాంస్కృతిక సంస్థలు, మీడియాకు చెందినవారు ఉన్నారు. సాధారణంగా, నామినేషన్ ప్రతిపాదనలను విశ్వవిద్యాలయంపంపుతుంది. అలా వచ్చిన జాబితాను ఛాన్సలర్ ఆమోదిస్తారు. ప్రత్యేకించి ఈ విషయంలో యూనివర్సిటీలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులనే వర్శిటీ అధికారులు ప్రతిపాదించడం జరిగింది.

అయితే, ఈ కేసులో ఛాన్సలర్‌గా, అన్ని సంప్రదాయాలు, ప్రజాస్వామిక నిబంధనలను గవర్నరు తుంగలో తొక్కారు. యూనివర్శిటీ ప్రతిపాదించిన పేర్లను తిరస్కరిస్తూ, ఇద్దరు మినహా అన్ని సెనెట్ సీట్లను సంఘ్ పరివార్‌కు చెందిన వ్యక్తులతో నింపేశారు. గవర్నర్ నామినేట్ చేసిన వారిలో ఆరెస్సెస్ అధ్యాపక పరిషత్ ఆఫీస్ బేరర్లు అయిన ఉపాధ్యాయులు ఉన్నారు. పాత్రికేయులు, క్రీడలు, న్యాయవాదులు, సాంస్కృతిక వ్యవహారాల కేటగిరీలలో కూడా ఆరెస్సెస్, బిజెపికి చెందిన పురుషులు, మహిళలను నియమించారు. మరీ దారుణమైన విషయమేమిటంటే హ్యూమానిటీస్, సైన్స్, ఆర్ట్స్, స్పోర్ట్స్ విభాగాల్లో మెరిట్ ప్రాతిపదికన యూనివర్సిటీ ఎంపిక చేసి పంపిన నలుగురు విద్యార్థుల స్థానంలో ఆరెస్సెస్ అనుబంధ విద్యార్థి విభాగమైన ఎబివిపికి చెందిన నలుగురు విద్యార్థులను గవర్నరు నామినేట్ చేయడం. కాలికట్ యూనివర్శిటీ సెనేట్‌కు కూడా అదే పద్ధతిలో నామినేట్ చేశారు. ఇక్కడ కూడా ఆరెస్సెస్, బిజెపికి చెందిన వారే నామినేట్ అయ్యారు. కేరళలోని ఉన్నత విద్యాసంస్థలను కాషాయీకరించేందుకు గవర్నరు ఈ విధంగా బరితెగించడాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ), యువజన, ఉపాధ్యాయ సంఘాలు, లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ తీవ్రంగా నిరసించాయి. కాలేజీలు, యూనివర్సిటీ క్యాంపస్‌లలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన విద్యార్థుల ఆందోళనలు ఉధృతమయ్యాయి. నలుగురు ఎబివిపి విద్యార్థులను సెనేట్‌కు ఎంపిక చేసిన గవర్నరు చర్యపై హైకోర్టు ఇప్పటికే స్టే విధించింది.

విద్యార్థుల నుంచి పెద్దయెత్తున నిరసనలు వ్యక్తమవడంపై గవర్నర్ అసహనంతో రగిలిపోయారు. తన దురుసు ప్రవర్తనతో ఘర్షణలు సృష్టించేందుకు యత్నించారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రాయోజిత ట్రస్ట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు కాలికట్ యూనివర్సిటీని సందర్శిస్తానని ఆయన ప్రకటించారు. నగరంలోని ప్రభుత్వ అతిథి గహంలో కాకుండా క్యాంపస్‌లోని యూనివర్సిటీ గెస్ట్‌హౌస్‌లో బస చేయాలని ఆయన నిర్ణయించుకున్నారు. విద్యార్థులు నిరసన తెలిపితే వారిని ముఖ్యమంత్రి పంపిన క్రిమినల్స్ అంటూ వారిని దుర్భాషలాడనారంభించారు. గెస్ట్ హౌస్‌లో బిజెపి నేతలతో సమావేశమైన అనంతరం ఆయన రాజ్‌భవన్ ద్వారా ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు, అందులో "రాష్ట్రంలో రాజ్యాంగ యంత్రాంగం పతనానికి ఇది నాంది" అని పేర్కొన్నారు. కొద్దిరోజుల క్రితం ఆయన రాష్ట్రంలో ఆర్థిక ఎమర్జెన్సీని ప్రకటించే విషయం గురించి మాట్లాడారు. ఉన్నత విద్యను కాషాయీకరించేందుకు గవర్నరు చేస్తున్న యత్నాలకు వ్యతిరేకంగా భారతీయ విద్యార్థి ఫెడరేషన్, ఇతర ప్రజాస్వామిక సంస్థలు నిరంతర పోరాటం సాగిస్తుండగా, కాంగ్రెస్ , దాని అనుబంధ విద్యార్థి సంఘం అత్యంత గర్హనీయమైన వైఖరిని తీసుకున్నాయి. నామినేటెడ్ సీట్లను ఆర్‌ఎస్‌ఎస్‌తో భర్తీ చేసిన గవర్నర్ చర్య తప్పు అని కేరళ స్టూడెంట్స్ యూనియన్ (కెఎస్‌యు) కానీ, కాంగ్రెస్ పార్టీ కానీ ఇప్పటివరకు ఖండించిన పాపాన పోలేదు.. వారి గుడ్డి మార్క్సిస్ట్ వ్యతిరేక వైఖరి ఆరెస్సెస్ సిబ్బంది ఉన్నత విద్యలో చొరబాటును, దాని వల్ల ఉన్నత విద్యకు ఎదురయ్యే ముప్పును విస్మరించేలా చేస్తుంది. ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ ప్రవర్తన రాజ్యాంగబద్ధమైన ఆ పదవిలో ఉండే వ్యక్తి పాటించాల్సిన నియమ నిబంధనలన్నిటినీ ఉల్లంఘించేదిగా ఉంది. ముఖ్యమంత్రిపైనా, రాష్ట్ర ప్రభుత్వంపైనా ఆయన చేస్తున్న బెదిరింపులు, దూషణలను కేరళ ప్రజలు సహించరు. గవర్నర్ దిక్కుమాలిన చర్యలను ఉపయోగించుకుని రాష్ట్రంలో తన ప్రభావాన్ని పెంచుకోవచ్చని భాజపా భావిస్తే అంతకంటే దారుణమైన పొరపాటు ఇంకొకటి ఉండదు.

## 17వరోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

**కోనసీమ, డిసెంబర్ 28(శ్రీచక్ర) :** సమ్మెబాట పట్టిన వాలంటీర్లపై జగన్ సర్కార్ ఉక్కుపాదం మోపుతోంది. సమ్మెకు దిగిన వాలంటీర్లను సర్వీస్ నుంచి టెర్మినేట్ చేయాలని సర్కార్ నిర్ణయించింది. కోనసీమ జిల్లా అమలాపురం మున్సిపాలిటీలో బుధవారం సమ్మెకు దిగిన 18 మంది వాలంటీర్లలో ముగ్గురిని తప్పించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ అయ్యాయి. మరికొందరిని తప్పించడానికి అధికారుల అడుగులు వేస్తున్నారు. ఎవరు సమ్మె చేసినా ఊరుకోవద్దని అమలాపురం మున్సిపల్ కమిషనర్ ఆడియో మెసేజ్‌లో ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ తీరు పట్ల వాలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మె గురువారం నాటికి 17వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె శిబిరంలో అంగన్వాడీలు మెడకు ఉరి తాళ్ళు బిగించుకొని నిరసన తెలిపారు. 17 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. సమస్యలు పరిష్కారం చేయాల్సిన ప్రభుత్వ యంత్రాంగం బెదిరింపులకు పాల్పడటం సరైంది కాదన్నారు.ప్రభుత్వం ఎంత బెదిరిస్తే ఉద్యమం అంతే స్థాయిలో ఉదతం చేస్తామని హెచ్చరించారు. శిబిరంలో అంగన్వాడీలు సమస్యలు పరిష్కారం చేయాలని కనీస వేతనాలు అమలు చేయాలని,గ్రాట్యుటీ చెల్లించాలని , మెనూ చార్జీలు పెంచాలని పెద్ద ఎత్తున నినదించారు. రాజంపేట ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు గురువారం పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ప్రతి అంగన్వాడీ మహిళ గురువారం ఉత్తరాలు రాసి తపాలా ద్వారా విజయవాడ లోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి పంపించారు. తిరుపతి జిల్లా గూడూరులో పోస్ట్ కార్డుల ద్వారా అంగన్వాడి కార్యకర్తలు నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి కి పోస్ట్ ద్వారా పోస్ట్ కార్డులను పంపించారు. రాజధాని ప్రాంతం తుళ్లూరులో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు గురువారం చెవిలో పువ్వుతో నిరసన తెలిపాఉ. కడప జిల్లా వేంపల్లెలో అంగన్వాడిల సమస్యను నువ్వేనా ఆలకించంటూ ఎద్దుకు వినతిపత్రం అందించారు. కనీస వేతనం 26000/-ఇవ్వాలని, అంగన్వాడీ కార్యకర్తలు, మినీ కార్యకర్తలు, ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, చివరి నెల జీతంలో సగం జీతం పెన్షన్ గా ఇవ్వాలని, తదితర డిమాండ్లతో కూడిన పోస్ట్ కార్డులు ముఖ్యమంత్రికి పిసిపల్లి మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు సిఐటియు ఆధ్వర్యంలో పంపడమైనది. అంగన్వాడి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇబ్రహీంపట్నంలోని మంత్రి జోగి రమేష్ ఇంటిని అంగన్వాడి కార్యకర్తలు, సిఐటియు నాయకులు ముట్టడి కార్యక్రమం చేపట్టారు. చాపాడులో గురువారం కోతికి తమ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. అంగన్వాడీ కార్యకర్తలు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా అంగన్వాడి కార్యకర్తల మండల నాయకులు సుజాత మాట్లాడుతూ ప్రభుత్వం తమ గోడు పట్టించుకోవడం లేదన్నారు.అందుకే కోతికి తమ బాధలను తెలియజేస్తున్నామన్నారు.చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ కష్టంగా ఉందన్నారు. ఎన్నికలకు ముందు జగన్ వేతనాలు పెంచుతామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. గుంటూరు విఎస్ఆర్ కళాశాల ఎదురుగా నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెలో సిఐటియు, సిపిఎం పార్టీలు తమ పూర్తి మద్దతును తెలిపాయి, పలు సంఘాల ప్రతినిధులు అంగన్వాడీలకు ఆర్థిక సహాయాన్ని అందించారు. గురువారం నిర్వహించిన సమ్మెలో సీఎం జగన్మోహన్ రెడ్డికి పోస్ట్ కార్డు ద్వారా తమ డిమాండ్లను తెలియజేశారు. అనంతపురం జిల్లా చిలమత్తూరులో పోస్టల్ కార్డు ఉద్యమం చేపట్టారు. పలు జిల్లాల్లో పోసట్ కార్డు ఉద్యమం చేపట్టారు.

# అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలి

**అమరావతి, డిసెంబర్ 28(శ్రీచక్ర) :**

అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని, విశ్వసనీయతకు మారుపేరుగా వైసిపి ఉండాలని సిఎం జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, వారికి దిశానిర్దేశం చేశారు. వైయస్సార్ పెన్షన్ కానుక, వైయస్సార్ ఆసరా, వైయస్సార్ చేయూత, అంబేద్కర్ విగ్రహం ప్రారంభోత్సవం తదితర కార్యక్రమాలపై కలెక్టర్లతో చర్చించారు. జనవరిలో 3, ఫిబ్రవరిలో 1, మొత్తంగా నాలుగు ప్రధానమైన కార్యక్రమాలు చేస్తున్నాం.. ఎక్కడా పొరపాట్లు లేకుండా చూసుకోవాలి.. ప్రతి కార్యక్రమానికి ప్రీలాంచ్, లాంచ్, పోస్ట్‌లాంచ్ కార్యక్రమాలు ఉంటాయి.. అవి సక్రమంగా నడిచేలా కలెక్టర్లు షెడ్యూల్ చేసుకోవాలన్నారు. జనవరి 1వ తేదీ నుంచి వైయస్సార్ పెన్షన్ కానుక రూ.3వేలకు పెంపు.. రూ.3 వేలకు పెన్షన్ పెంచుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని పూర్తిగా నెరవేరుస్తున్నాం.. విశ్వసనీయతకు ఈ ప్రభుత్వం మారు పేరు అని రుజువు చేస్తున్నాం.. జనవరి 1 నుంచి 8వ తేదీ వరకూ పెన్షన్ల పెంపు కార్యక్రమం ఉంటుంది. ఇప్పుడు నెలకు రూ.1950 కోట్ల ఖర్చు చేస్తున్నాం.. గతంలో పెన్షన్ల సంఖ్య 39 లక్షలు, ఇప్పుడు 66 లక్షలు ఉన్నారు.ప్రతి అడుగులోనూ కూడా ఏ లబ్ధిదారు మిగిలిపోకూడదు, ప్రతి ఒక్కరికీ కూడా మంచి జరగాలన్నారు. రెండో కార్యక్రమం జనవరి 19న అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నాం.. జనవరి 23 నుంచి 31 ఆసరా కార్యక్రమం జరుగుతుంది. నాలుగో కార్యక్రమం వైయస్సార్ చేయూత కార్యక్రమం ఫిబ్రవరి 5 నుంచి 14వరకూ కొనసాగుతుంది.. ప్రభుత్వం చాలా ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తుంది.. అర్హత ఉండీ ఎవరైనా ఎక్కడైనా మిగిలిపోయిన సందర్భాల్లో వారికి పథకాలు వర్తింపు చేసే బై యాన్యువల్ కార్యక్రమం జనవరి 5న జరుగుతుంది. మన ప్రభుత్వం విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచిందన్నారు. ప్రతి ఒక్కరికీ 8 రోజులపాటు పెంచిన పెన్షన్లతో పెన్షన్ కానుక కార్యక్రమం జరుగుతుంది. ఆసరా కోసమే రూ.25,570 కోట్లు ఖర్చు చేశాం.. మూడు విడతలుగా ఇప్పటికే రూ.19,,195 కోట్లు ఇచ్చాం.. చివరి విడతగా 6,394 కోట్లు ఇస్తున్నాం.. జనవరి 23 నుంచి 31వ తారీఖు వరకూ కూడా ఈ కార్యక్రమం కొనసాగుతుంది.. ఈ కార్యక్రమం ద్వారా 78.94 లక్షల మంది మహిళలు లబ్ది పొందారు. మహిళల్లో సుస్థర జీవనోపాధి కల్పించాలన్నదే ఆసరా, చేయూత పథకాల ఉద్దేశం అన్నారు. పెన్షన్ కానుక, ఆసరా, చేయూత లబ్దిదారుల విజయగాధలను వీడియోల రూపంలో పంపాలి.. పంపిన వాటిలో అత్యుత్తమమైన వాటికి ఈ బహుమతులు ఇస్తాం.. ఇవి మరికొందరిలో స్ఫూర్తిని పెంచుతాయి. ఇక, జనవరి 19 విజయవాడలో అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. రూ.404 కోట్లతో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నాం.. సామాజిక న్యాయానికి ప్రతిరూపంగా ఈ విగ్రహాన్ని నిర్మిస్తున్నాం. సచివాలయం స్థాయి నుంచి రాష్ట్రస్థాయివరకూ సామాజిక న్యాయ నినాదం వినిపించాలి. ఈ మార్పునకు ప్రతిరూపంగా అంబేద్కర్ విగ్రహం నిలుస్తుందని సీఎం జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఎవ్వరూ కూడా ఇబ్బందులు పడకూడదని ఎప్పుడూ లేని విధంగా వాలంటీర్ సచివాలయ వ్యవస్థను గ్రామస్థాయిలో తీసుకు వచ్చాం. ఆదివారమైనా, పండుగైనా సరే ఒకటో తారుఖీన

చిక్కటి చిరునవ్వుతో పెన్షన్‌ను ఇంటివద్దే ఇచ్చే పరిస్థితిని, మార్పును తీసుకురాగలిగాం. ఈ నాలుగున్నర సంవత్సరాల కాలంలో ఈ మార్పును తీసుకురాగలిగాం. ఈ మార్పును ఎలా తీసుకు రాగలిగామన్నది ప్రతి గడపకూ తెలియజేయాల్సిన అవసరం ఉందని సీఎం పేర్కొన్నారు. మన ప్రభుత్వం విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచింది. ఈ సందేశం ప్రతి ఒక్కరికీ చేరాలి. పెన్షన్ల పెంపు కార్యక్రమంలో భాగంగా నేను 3వ తేదీన కాకినాడలో పాల్గొంటున్నాను. అవ్వాతాతలు వేచిచూసే పరిస్థితి లేకుండా 1వ తేదీనే ప్రారంభం అవుతుంది. ప్రజా ప్రతినిధులు అందరూ కూడా పెన్షన్ కానుక కార్యక్రమంలో భాగస్వాములు కావాలి. ఎమ్మెల్యేలు ప్రతి మండలంలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలి. దీనిపె షెడ్యూలు చేసుకోవాలి. 8 రోజులపాటు పెంచిన పెన్షన్లతో పెన్షన్ కానుక కార్యక్రమం జరుగుతుంది. పెన్షన్‌తోపాటు నా తరపున లేఖను కూడా లబ్దిదారులకు అందించాలి. అలాగే నేను ఇచ్చే వీడియో సందేశం కూడా లబ్దిదారులకు చేరవేయాలి. ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, ఉత్సహవంతులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని సీఎం పేర్కొన్నారు. చరిత్రలో ఎప్పుడూ కూడా అవ్వాతాతలను ఈ విధంగా పట్టించుకున్న ప్రభుత్వం లేదు. వారి ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంటి వద్దకే పెన్షన్ అందిస్తున్నాం. దీనికోసం వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థను నెలకొల్పాం. దేశంలో కూడా ఇంత పెద్ద మొత్తంలో పెన్షన్ డబ్బు ఇవ్వలేదు. మనం చెప్పిన మాటను నెరవేర్చాలా మన ప్రభుత్వం కృతనిశ్చయంతో అడుగులు వేసింది. ఇచ్చిన హామీని మనసా వాచా అమలు చేయడానికి ఎంతగా కష్టపడ్డామో అందరికీ తెలిసిందే. ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రతి లబ్దిదారులకు తెలియాలి. ఏడాదికి దాదాపు రూ.23 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం అని సీఎం తెలిపారు. మన ప్రభుత్వం రాకముందు పొదుపు సంఘాలు పూర్తిగా కుదేలై పోయాయి. ఏ గ్రేడ్, బి గ్రేడ్ సంఘాలు మరింతగా పడిపోయాయి. 18శాతం పైచిలుకు అక్కౌంట్లన్నీకూడా అవుట్ స్టాండింగ్, ఎన్‌పీఏల స్థాయిలోకి వెళ్లిపోయాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుదేలైపోయింది. మనం వారికి చేయూత నిచ్చి ఆసరా, సున్నావడ్డీ, చేయూత, అమ్మ ఒడి పథకాల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టగలిగాం. మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారితను సాధించగలిగాం. క్రమం తప్పకుండా ప్రతి ఏటా లబ్దిదారులకు అందించగలిగాం. అందుకనే ఈరోజు పొదుపు సంఘాల్లో ఎన్‌పీఏలు 0.3శాతానికి చేరాయని అన్నారు.

# జగనన్న ఆరోగ్య సురక్షకు కేంద్రం నిధులే..!

- ప్రధాని ఫోటో లేకపోవడం దారుణం
- బీజేపీ ఇన్‌చార్జ్ మాచానూరు సుబ్బరాయుడు

**ప్రొద్దుటూరు, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందనే జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి కూడా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులేనని, అయితే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఫోటోను వినియోగించక పోవడం దారుణం అని బిజెపి మైదుకూరు నియోజకవర్గ ఇన్చార్జి మాచనూరు సుబ్బారాయుడు విమర్శించారు. గురువారం దువ్వూరు మండల పరిధిలోని చింతకుంట, భీమునిపాడు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతోందన్నారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో పాటు 104 వాహనానికి కూడా కేంద్రం నిధులు ఇవ్వడం జరుగుతోందన్నారు. ఇలా ఒకటేమిటి ఎన్నో సంక్షేమ పథకాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుందన్నారు. వాటిని రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకుంటూ ప్రజలకు మేమే చేస్తున్నామని చెప్పుకోవడం సబబు కాదన్నారు. అందుకే వికసిత్ భారత్ సంకల్ప యాత్రను చేపట్టి కేంద్ర ప్రభుత్వం నుంచి ఏయే నిధులు వస్తాయనే దానిపై అయా మండల టీం అధికారులతో కలిసి ప్రజలను చైతన్య పరచడం జరుగుతోందని ఆయన వివరించారు. కావున ప్రజలు కేంద్ర ప్రభుత్వం నుంచి అమలయ్యే పథకాలను గురించి తెలియజేస్తున్నామని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు గ్రామీణ సడక్ యొజన,గిరిజన విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌లు, ప్రధాన మంత్రి ఆవాస యోజన, సురక్షిత మంచి నీటి సరఫరా, పిఎం ముద్ర యోజన, సుకన్య సమృద్ధి యోజన, ఆయుష యాన్ భారత్, జన ధన యోజన, సురక్ష భీమా యోజన, జీవన జ్యోతి భీమా యోజన, ఆటల్ పెన్షన్ యోజన, స్వానిధి యోజన, పిఎం కిసాన్, గరీబ్ కల్యాణ్ యోజన, స్వదేశీ ధరశన పథకం, రైల్వే స్టేషన్‌ల ఆధునీకరణ, వందే భారత్ రైళు ‌, నేషనల్ హైవేల అభివృద్ధి చేయడం, ఏక లవ్య పాఠశాలలు వంటి వాటిని గురించి ప్రజలకు వివరముగా చెప్పడం జరుగుతోందని ఆయన తెలిపారు. ముఖ్యంగా రైతులకు సంబంధించిన నానో ఎరువులు, పురుగు మందులు, డ్రోన్ ద్వారా పిచికారి చేయు విధానం గురించి క్షేత్ర స్థాయిలో రైతులకు వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మైదుకూరు నియోజకవర్గ ఇన్చార్జి మాచనూరు సుబ్బరాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్నాటి ఎల్లారెడ్డి, దువ్వూరు మండల నాయకులు, మైదుకూరు అర్బన్ మండల అధ్యక్షులు రామకృష్ణ, ఖాజీపేట మండల అధ్యక్షులు అజయ్, బిజెపి నాయకులు, కార్యకర్తలు,అభిమానులు ,రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# ప్రపంచంలోనే సర్వ మతాల సమ్మేళనం మన భారతదేశం

- క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేసిన సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డా. శంకర్ శర్మ



**కర్నూలు, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

ప్రపంచంలోనే భిన్న మతాలు, భిన్న సంస్కృతులకు ఏకైక నిలయం మన భారతదేశం అని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డా. శంకర్ శర్మ అన్నారు. గురువారం కర్నూల్ నగరంలోని బుధవారం పేటలో ఉన్న చర్చిలో క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని పేద మహిళలకు సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర శర్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పావని, ఉషారాణి ,మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా.శంకర శర్మ మాట్లాడుతూ క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని క్రైస్తవ పేద మహిళలకు చీరలు పంపిణీ చేయడం తనకు ఆనందాన్ని కలిగిస్తుంది అని చెప్పారు. ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా భిన్న మతాలు, భిన్న సంస్కృతులు మన దేశంలో ఉన్నాయని, మనదేశంలో హిందువులు, క్రైస్తవులు, ముస్లింలు, బౌద్ధులు, జైనులు ఇలా అన్ని మతాలవారు కలగలిపి జీవనం సాగించడం అందరికీ ఆదర్శప్రాయం అని చెప్పారు. ఎవరు ఏ మతంలో ఉన్నప్పటికీ ఇతరుల మతాన్ని గౌరవించడం నేర్చుకోవాలనీ చెప్పారు. ప్రపంచంలోని చాలా దేశాల్లో మతపిచ్చితో మతకల్లోలాలు చెలరేగి మారణకాండ జరుగుతుందని ఇది ఎంత మాత్రం సహించరాని విషయమని చెప్పారు. ఎవరు ఏ మతంలో ఉన్నా ఇతరుల మతాన్ని గౌరవించాలన్న విషయాన్ని విస్మరించరాదు అన్నారు. క్రైస్తవ సోదరులు క్రిస్మస్ పండుగతో పాటు నూతన సంవత్సరం వరకు పండగ వాతావరణంలో జీవిస్తారని అందుకే వారికి చీరలు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగం రచించే సమయంలో మన దేశాన్ని సెక్యులర్ దేశంగా ప్రకటించారని , దీనికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని ఆయన తెలిపారు. మానవత్వం, దయాగుణం కలిగి ఉండాలన్న ఏసుక్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ పాటించి సమాజ హితానికి పాటుపడాలని కోరారు. ప్రపంచ మానవాళి పాపాలను కడగడానికి ఏసు ప్రభువు ఈ లోకానికి వచ్చారని , వారి మనస్సుకు శాంతి కలగాలని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో ఎంతో కొంత భాగాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించాలని, అప్పుడే మన జీవితానికి సార్థకత ఏర్పడుతుందని డా. శంకర్ శర్మ అన్నారు.

# రానున్న టీడీపీ హయాంలో మహిళలకే అధిక ప్రాధాన్యత

- మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి



**ప్రొద్దుటూరు, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

రానున్న టిడిపి హయాంలో మహిళలకే అధిక ప్రాధాన్యత మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు లరెడ్డి, యువ నాయకులు నంద్యాల కొండారెడ్డి తెలిపారు. గురువారం బాబు షురిటి భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా 43వరోజు మునిసిపాలిటీ పరిధిలోని 29వవార్డు బంగారయ్య కొట్టాలు, వసంతపేట వీధులలో తెలుగుదేశంపార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ముందస్తు మానిపెస్టోను ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, తెదేపా కడప పార్లమెంట్ సెక్రెటరీ సిద్ధారెడ్డి నాగమునిరెడ్డి, తెదేపా పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు జింక రామకృష్ణ, పట్టుపోగుల మధుసూదన్, ఉమ్మడిశెట్టి రోహన్ కుమార్, వాసవి బాబు, కుంటుమల్ల రంగస్వామి, సింగనమల్ల ఆంజనేయులు, శీలా రమణయ్య, వెంకటసుబ్బయ్య, మేరువ సుబ్బయ్య, జింకా రాజశేఖర్, ఉమ్మడిశెట్టి చౌడయ్య, వద్ది రమణ, మాజీ కౌన్సిలర్లు వద్ది బాలుడు, సోమా బాలయ్య, తలారి పుల్లయ్య, పాములేటి నరసింహులు, యర్రన్న, నాయకులు ధనిరెడ్డి రామచంద్రారెడ్డి, పల్లా శంకర్ నారాయణ, చీమల రాజశేఖరరెడ్డి, బోనం గురివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆడపిల్లలను కాపాడండి దేశ ప్రగతిని పెంచండి

- బాలిక దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు



**ప్రొద్దుటూరు, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా మైదుకూరు మండల విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో ఆడపిల్లలను కాపాడండి అనే అంశం మీద మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు మండల స్థాయిలో గురువారం వ్యాసరచన, వక్తృత్వ మరియు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. మైదుకూరు మండల విద్యాశాఖ అధికారి-2 బి నరహరి శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మైదుకూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎల్.సూర్య నారాయణరెడ్డి , ఎం.ఇ.ఒ కార్యాలయ సిబ్బంది, సి.ఆర్.పి లు, పాలిటెక్నిక్ లెక్చరర్ స్వర్ణ కుమారి మరియు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆడపిల్లలను కాపాడాలని ఆడపిల్లలను రక్షించండి, ఆడపిల్లలను చదివించాలని తెలిపారు.సృష్టికి మూలం స్త్రీ అంటారు. సృష్టి ధర్మం ప్రకారం స్త్రీ పురుషులు బాలబాలికలు ఇరువురు సమానమే. ఒకరు తక్కువ కాదు మరొకరు ఎక్కువగా కాదు. అనాదిగా భావిత భారతావనిలో స్త్రీకి విశిష్టత ఉంది. మాతృమూర్తిగా పూజ్యనీయస్థాయిలో ఉంది. కానీ నేటి ఆడపిల్ల పుట్టిందంటేనే బరువు బాధ్యత అనే ఆలోచనతో ఆడపిల్ల పట్ల అనాదరణ చూపడం జరుగుతుంది. మొదటి సంతానంలో ఆడపిల్ల ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ ఆడపిల్లలు పుట్టే దంపతులు మగ సంతానం కావాలని ఆలోచనలతొ ఉన్నారు. ఆడపిల్లలకు వరకట్నం ఇవ్వాల్సి రావడం, కొడుకు వల్ల వంశాభివృద్ధి జరుగుతుందని, కర్మకాండలు కొడుకులు చేస్తేనే స్వర్గపు ప్రాప్తి కలుగుతుందని నమ్మకంతో మరియు కుటుంబ పెద్దలు ఒత్తిడి వలన ఆడపిల్లలు వివక్షతకు గురవుతున్నారు. కానీ బాలికల మనగడే దేశ ప్రగతి అని అందుకే ఆడపిల్లలను పుట్టనిద్దాం బ్రతకనిద్దాం చదవనిద్దాం అని తెలిపారు. వ్యాసరచన భక్తుతువా చిత్రలేఖన పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులను అభినందించారు.మండల స్థాయిలో గెలుపొందిన వారు త్వరలో జిల్లా స్థాయిలో పాల్గొనుటకు వెళ్ళవలసి ఉందని తెలిపారు.

# శ్రీ గిడ్డాంజనేయస్వామి హుండీ ఆదాయం రూ.5,17,835



**పెద్దకడబూరు, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

పెద్దకడబూరు మండల పరిధిలోని తారాపురం గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ గిడ్డాంజనేయస్వామి హుండీ లెక్కింపు కార్యక్రమం గురువారం ఈఓ రాంప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. 2023 మార్చి 31 నుండి డిసెంబర్ 28 వరకు సంబంధించిన స్వామివారి హుండీని లెక్కించడం జరిగిందన్నారు. మొత్తం హుండీ ఆదాయం 6,17,835 రూపాయలు వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఇందులో ఆంజనేయస్వామి ఆలయం హుండీకి సంబంధించి రూ. 5,47,830, తిక్కతాత స్వామి ఆలయానికి సంబంధించి రూ. 70,005 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ సుబ్బారాయుడు, సిబ్బంది ఆచారి, అర్చకులు నాగరాజుస్వామి, గిరిస్వామి, హనుమేష్ స్వామి, బసవరాజుస్వామి, పరమేష్ స్వామి, ఆదోనికి చెందిన శ్రీ భ్రమరాంభిక సేవా సమితి సేవకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ వాహనాన్ని అడ్డుకున్న మున్సిపల్ కార్మికులు



**ప్రొద్దుటూరు, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ అవుట్సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె ఉధృతంగా మారింది. గురువారం గాంధీ రోడ్డు మీద వెళ్తున్న మునిసిపల్ చెత్త సేకరణ వాహనాన్ని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు అడ్డుకుని రోడ్డుపై బైఠాయించి తమ న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీగా మున్సిపల్ కార్యాలయానికి బయలుదేరారు. తక్షణం మున్సిపల్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలంటూ వారికి రావలసిన అలవెన్సు త్వరితగతిన ప్రభుత్వం చెల్లించాలంటూ వైసీపీ ప్రభుత్వం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు పెద్ద ఎత్తున గాంధీ రోడ్డు మీద ట్రాఫిక్ కు అంతరాయం కలిగింది.

# సామాజిక సాధికార యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్సీ ఆర్. రమేష్ యాదవ్




**ప్రొద్దుటూరు, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

రాయచోటి శాసనసభ్యులు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి నందు గురువారం సామాజిక సాధికార యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానం, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, రాయచోటి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్సీ ఆర్. రమేష్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా లోనే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం మీద సంక్షేమంలోనే కాకుండా రాజకీయంగా బీసీలకు జగనన్న ఇచ్చిన ప్రాధాన్యతను గురించి వివరించారు.

# నాటుసారా స్థావరాలపై పోలీసుల దాడులు

- ముగ్గురిపై కేసు నమోదు





**పెద్దకడబూరు, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

పెద్దకడబూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ముచ్చిగిరి గ్రామ శివారుల్లోని కొండల్లో నాటుసారా తయారీ స్థావరాలపై ఎస్ఐ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం పోలీ సులు దాడులు నిర్వహించారు. దాడుల్లో 1600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అలాగే 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. నాటుసారా తయారీ చేస్తున్న ముచ్చిగిరి గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు పరారయ్యారు. ఈ సంఘటనపై ఎస్ఐ మహేష్ కుమార్ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై ఉక్కు పాదం మోపుతున్నట్లు స్పష్టం చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. దాడులలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు మేడిగడ్డకు మంత్రుల రాక

**హైదరాబాద్ :** రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు కలిసి శుక్రవారం 29న మేడిగడ్డ బ్యారేజీని సందర్శించనున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నుంచి మంత్రులు మేడిగడ్డకు బయలుదేరుతారు. బ్యారేజీ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టుపై నీటిపారుదల శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుల వివరాలు.. ప్రాజెక్టు వ్యయం, దాన్ని కట్టడం ద్వారా జరిగిన లాభ, నష్టాలపై వివరణ ఇవ్వనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణకు అవసరమైన విద్యుత్తు, మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల సమస్యలు, వాటి పరిష్కారాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ప్రాజెక్టు నిర్మాణ సంస్థలు, సబ్ కాంట్రాక్టర్లు, నిర్మాణంతో సంబంధం ఉన్న అందరూ సమావేశంలో పాల్గొనే విధంగా సమాచారం అందించాలని ఈఎన్సీని మంత్రులు ఆదేశించారు.

# ఆత్మీయ పలకరింపులతో బొల్లినేని ప్రజా దీవెన యాత్ర



● మాజీ శాసనసభ్యులు బొల్లినేని వెంకట రామారావు

**ఉదయగిరి, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

ఉదయగిరి నియోజకవర్గం లోని ఉదయగిరి మండలంలో ప్రధాన పట్టణం లోని ఇందిరా నగర్ కాలనీ లో ప్రజా దీవెన యాత్ర లో భాగంగా బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం నియోజకవర్గ ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు బొల్లినేని వెంకటరామారావు రెండవ రోజు గురువారం నాడు బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ ప్రజా దీవెన యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ మహానాడు వేదికగా ప్రకటించిన మినీ మేనిఫెస్టో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ పథకాలు స్థానిక ప్రజలకు వివరిస్తూ ఆత్మీయ పలకరింపులతో జన సంద్రోహం నడుమ ప్రజా దీవెన యాత్ర కొనసాగించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని ఆయనకు మంగళహారతలతో బ్రహ్మరథం పట్టారు. అంతేకాకుండా ఇందిరానగర్ కాలనీవాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తమ ఆత్మీయ నేత ఉదయగిరి అభివృద్ధి ప్రదాత అయినా మా నాయకులు మాజీ శాసనసభ్యులు బొల్లినేని వెంకట రామారావు ప్రజా దీవెన యాత్ర సంపూర్ణంగా విజయవంతం అవ్వాలని , మళ్లీ శాసనసభ్యులుగా ఎన్నికై రావాలని కాలనీవాసులు ప్రార్థనలో కోరారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ పథకాలు ముఖ్యమైన మహాలక్ష్మి పథకం ద్వారా ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం, దీపం పథకం ద్వారా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ప్రవేశ పెట్టనున్న సూపర్ సిక్స్ పథకాలు మహాలక్ష్మి, పూర్ టు రిచ్ , ఇంటింటికి మంచినీరు, అన్నదాత, యువ గళం, బీసీలకు రక్షణ చట్టం వంటి పథకాలు గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ కు ఓటమి భయం పట్టుకుంది అని అందుకే ఇంచార్జ్ లు ను మారుస్తున్నాడని అన్నారు. మీరు ఎన్ని కుయుక్తులు చేసిన రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రజలు ఈ ప్రభుత్వాన్ని గద్దె దించటం ఖాయం అని పేర్కొన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అభివృద్ధిని గాలికి వదిలేసి కేవలం రాజకీయ కక్ష సాధింపులే దేయంగా పనిచేస్తుందని అంతేకాకుండా ప్రజలకు నవరత్నాల పేరుతో ఒక చేత్తో పది రూపాయలు ఇస్తూ మరో చేత్తో వంద రూపాయలు వసూలు చేస్తుందని తెలిపారు. నిత్యవసర ధరల ఆకాశాన్ని అంటడం, గ్యాస్, పెట్రోల్, డీజిల్, బస్సు చార్జీలు, కరెంట్ చార్జీలు పెంచడం, ఇంటి పన్ను చెత్త పన్ను ఇలా అనేక విధాలుగా పన్నులు వసూలు చేస్తూ పేద సామాన్య మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం మోపుతూ పెరిగిన ఖర్చులకు ప్రజలు ఈ ప్రభుత్వం పై విసుగెత్తిపోయారని అన్నారు. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల ఎప్పుడు వచ్చిన ఈ వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చెంచలబాబు యాదవ్, పరిశీలకుడు వికాస్ హరికృష్ణ, మండల కన్వీనర్ బయన్న, మాజీ ఏఎంసి చైర్మన్ వెంకటరెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ రియాజ్,సీనియర్ నాయకులు బొజ్జా నరసింహులు, ఓబులరెడ్డి, నల్లిపోగు రాజా, నల్లిపోగు నరసింహులు ,గడ్డం వెంకటేశ్వర్లు,గూడూరు వెంకటేశ్వరరావు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ సంజీవనీ ఆరోగ్య రథం వైద్య సేవలు



**ఉదయగిరి/వరికుంటపాడు, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

వరికుంటపాడు మండలంలోని వరికుంటపాడు పంచాయతీలో గురువారం నాడు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు శివరామిరెడ్డి, సుంకర రాధాకృష్ణ, లింగం మాలకొండయ్య, మద్దినేని నరసింహారావు, శ్రీనివాసులు, తదితరులు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సంజీవని ఆరోగ్య రథం వైద్య సేవలు నిర్వహించారు. ఎన్టీఆర్ సంజీవిని ఆరోగ్య రథం ప్రారంభించి నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తూ 219వ రోజు సంజీవని ఆరోగ్య రథం వరికుంటపాడు మండల కేంద్రములోని సాయిబాబా గుడి దగ్గర ఏర్పాటు చేయగా స్థానిక గ్రామ పరిధిలోని ప్రజలు వచ్చి అనారోగ్య సమస్యలు ఉన్న వారు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సంజీవిని ఆరోగ్య రథం వద్దకు వచ్చి డాక్టర్ల చేత ఉచితముగా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు వారికి అవసరమైన మందులు డాక్టర్ల సూచనలు మేరకు ఉచితంగా అందించారు. సుమారు 183 మంది గ్రామస్థులు డాక్టర్ ను వివిధ ఆరోగ్య సమస్యలతో ప్రజలు సంప్రదించారు. పలువురు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు నియోజకవర్గంలో ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని స్థానిక నాయకులు, ప్రజలు ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ ప్రజలు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 600 కిలోల అయోధ్య రామాలయ గంట

**అయోధ్య :** ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం అయోధ్యలో నిర్మిస్తున్న శ్రీ రామ మందిర గర్భగుడి నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. భవ్య రామమందిరం తుది మెరుగులు దిద్దుకుంటోంది. జనవరి 22న ఐదేళ్ల బాలుడి రూపంలో శ్రీరాముడు ఆలయంలో కొలువుదీరనున్నాడు. రాముడి విగ్రహానికి ఎన్ని విశిష్టతలున్నాయో.. అక్కడ ఏర్పాటు చేయబోయే గంటకూ అన్నే విశేషాలున్నాయి. దీనిని తమిళనాడులో ప్రత్యేకంగా తయారు చేయించారు. అష్టధాతువుతో తయారు చేసిన ఈ గంట రామ మందిరంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. 600 కిలోలకు పైగా బరువున్న దీనిని ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటూ 2020 నుంచే తయారు చేయడం ప్రారంభించారు. రామమందిర ప్రారంభోత్సవం దగ్గర పడుతుండడంతో తమిళనాడు నుంచి అయోధ్యకు తరలించారు. గంటపై జై శ్రీరామ్ అని రాసి ఉంది. దీనిని ప్రస్తుతం ఆయోధ్య రామమందిర ప్రాంగణంలో భక్తుల సందర్శనార్థం ఉంచారు. ఇక జనవరిలో జరగనున్న రామమందిర ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగి సహా పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. ప్రస్తుతం రామ్‌లల్లా విగ్రహాలు తుదిమెరుగులు దిద్దుకుంటున్నాయి.

# భూ వివాదంలో ఘర్షణ..వ్యక్తి మృతి



**మర్రిపాడు, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

మర్రిపాడు మండల పరిధిలోని భీమవరం గ్రామానికి చెందిన సర్పంచ్ బంధువుల మధ్య గురువారం నాడు పొలంను రి సర్వే నిర్వహిస్తుండగా పొలంలో ఘర్షణ చోటుచేసుకుంది. మాజీ సర్పంచ్ మంద రామరత్నారెడ్డిని ఆయన తమ్ముడు కొడుకు రఘు గేజిల్ ట్రాక్టర్ తో తొక్కించడంతో మాజీ సర్పంచ్ రామ రత్నారెడ్డి కొనవపిరితో కొట్టుమిట్టాడి తుది శ్వాస విడిచారు. రఘు భార్య కృష్ణవేణి కూడా తలకు రక్తదాయమైంది. విషయం తెలుసుకున్న మర్రిపాడు ఎస్ఐ విశ్వనాథరెడ్డి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆత్మకూర్ ఏరియా హాస్పిటల్ కి తరలించారు. వారి పరిస్థితి విషమంగానే ఉన్నట్లు సమాచారం జరిగిన ఘటనను క్షేత్రస్థాయిలో పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని స్థానిక ఎస్ఐ పి. విశ్వనాథరెడ్డి తెలియజేశారు. ఆత్మకూరు ఏరియా హాస్పిటల్ చికిత్స పొందుతున్న వారిని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి పరామర్శించారు.

# ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు






● వైసిపి నాయకులు బాదం వెంకటనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర

**ఉదయగిరి/వరికుంటపాడు, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

వరికుంటపాడు మండలంలోని గణేశ్వర పురం సచివాలయ పరిధిలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం స్థానిక వైసిపి సీనియర్ నాయకులు బాదం వెంకట నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం నాడు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కబాడీ పోటీలు నిర్వహించారు. మహిళా క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎంపీడీవో చేవూరి శ్రీదేవి పాల్గొని పర్యవేక్షించారు. క్రీడాకారులకు అవసరమైనటువంటి సౌకర్యాలు స్థానిక వైసిపి నేత వెంకట నారాయణ రెడ్డి ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఉన్నటువంటి యువతి యువకులు వారిలో దాగివున్న క్రీడా నైపుణ్యాన్ని వెలిగితే మే కాకుండా మానవ శరీరానికి ఎంతో ఉల్లాసాన్ని కలిగించిద్దని అన్నారు. గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వం యువతలో ఉన్న క్రీడ నైపుణ్యాన్ని వెలిగి తీయటం ప్రయత్నించలేదని కానీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గ్రామాల్లో ఉన్న యువతీ యువకుల నైపుణ్యాన్ని వెలిగితే ఎంతో గొప్ప విషయం అని కొనియాడారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో విప్లమాతకమైన సంస్కరణలు తీసుకొని వచ్చి సచివాలయ వ్యవస్థను రూపొందించి తద్వారా గ్రామాల్లోని ప్రభుత్వ సేవలు అందే విధంగా కృషి చేశారని అంతే కాకుండా రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రజలకు అవసరమైనటువంటి అన్ని కార్యక్రమాలు నేరుగా అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ ఫలాల పంపిణీ పండుగలా జరగాలి






● జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు

**కడప, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

2024 సంవత్సరంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలను లబ్ధిదారులకు పండుగ వాతావరణంలో పంపిణీ చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని.. జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా.. 2024 జనవరి నెలలో అమలు చేయనున్న నాలుగు ప్రధాన కార్యక్రమాల నిర్వహణ, తీసుకోవలసిన చర్యలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు కడప కలెక్టరేట్ వీసీ హాలు నుంచి జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు, మైదుకూరు, రాజంపేట ఎమ్మెల్యేలు రఘురామి రెడ్డి, మేడా మల్లికార్జున రెడ్డి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సలహాదారు రాజోలు వీరారెడ్డి, రాష్ట్ర ఉద్యాన సలహాదారు పి.శివప్రసాద్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హాజరయ్యారు. సీఎం వీసీ ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశానుసారం వచ్చే ఏడాది జనవరి నెలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న కార్యక్రమాలకు సంబంధించిన కార్యక్రమాల నిర్వహణపై ప్రజల్లో అవగాహన పెంచేలా ప్రచారం చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి పంపిణీ కార్యక్రమం.. గ్రామ సచివాలయాల నుండి జిల్లా స్థాయి వరకు.. పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. అలాగే మూడో అంశంగా జనవరి 23న చివరి దఫా వైఎస్సార్ ఆసరా సొమ్ము విడుదల కార్యక్రమంపై రెండు విడతలుగా చేపట్టే ప్రచారం, నాల్గవ అంశంగా ఫిబ్రవరి 5 నుంచి 14వ తేది వరకు వైఎస్సార్ చేయూత పథకం కింద ఆర్థిక సహాయం పంపిణీ చేసే కార్యక్రమాలు, అదేవిధంగా వాలంటీర్లచే సంక్షేమ పథకాలపై లబ్ధిదారులచే రూపొందించిన బెస్ట్ టెస్టిమోనీ వీడియోలను అప్లోడ్ చేయించడం, జనవరి ఒకటి నుంచి రెండో ఫేజ్ "జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం" నిర్వహణ వంటి అంశాలపై ముఖ్యమంత్రి సమీక్షించిన అంశాలను జిల్లా కలెక్టర్ అధికారులకు తెలియజేసారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, డీఆర్డీఏ, మెప్మా పిడీలు ఆనంద్ నాయక్, సురేష్ రెడ్డి, సంబందిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలి : ఎమ్మెల్యే ధనలక్ష్మి





**చింతూరు, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందించాలని రంపచోడ వరం ఎమ్మెల్యే ధనలక్ష్మి అధికారులకు సూచించారు. చింతూరు మండలం ఏడుగురాళ్ళపల్లి సచివాలయం పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ధన లక్ష్మి నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఈ నాలుగు సంవత్సరాలు కాలంలో వైయస్సార్ సిపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ,అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ఆయా పథకాల ద్వారా లబ్ధిదారులకు నగదు ఎంత వచ్చిందో కూడా తెలియజేశారు. రానున్న కాలంలో కూడా ఈ సంక్షేమ పథకాలను మరింత పకడ్బందీగా అమలు చేస్తామని తెలిపారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేచించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకొని, వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ సి పి మండల అధ్యక్షుడు వై రామలింగారెడ్డి,జడ్పిటిసి చిచ్చుడి.మురళి,ఎంపీపీ అమల,వైస్ ఎంపీపీ సుధాకర్ (చిన్ని),అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# భవనిర్మాణ కార్మికులకు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలి






- భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారపల్లి రమణారావు

**భీమవరం, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

భవనిర్మాణ కార్మికులకు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలని కోరుతూ గురువారం పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్ వద్ద ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారపల్లి రమణారావు మాట్లాడుతూ 30 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉంటే భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో కేవలం 19 లక్షల 80 వేల మందిని మాత్రమే నమోదు చేసుకున్నారని వారిలో చాలామందికి నేటికీ గుర్తింపు కార్డులు ఇవ్వలేదని విమర్శించారు. కార్మికులకు సంక్షేమ పథకాలు ఆపేస్తూ ఇచ్చిన మెమో 12 14 రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో, ఉన్న భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరిం చడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 60 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికులకు ఐదువేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, బిల్డింగ్ రంగం మెటీరియల్ ధరలు తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. ప్రభుత్వం వాడుకున్న సంక్షేమ బోర్డు నిధులు వెంటనే సంక్షేమ బోర్డుకు జమ చేయాలని, పక్క రాష్ట్రా ల్లో అమలు చేస్తున్న విధంగా సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దాసిరెడ్డి కోటేశ్వరరావు జిల్లా ఉపాధ్యక్షులు నాగభూషణం పసుపులేటి సత్యనారాయణ జిల్లా ప్రధాన కార్యదర్శి మండా సూరిబాబు, సత్తిబాబు పాల్గొన్నారు.

# లీగల్ సర్వీసెస్ ద్వారా ఉచిత న్యాయ సహాయం చేసుకోండి






- ఏలూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

**భీమవరం, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్నప్రసాద్ గురువారం.స్థానిక చాటపర్రు గ్రామ సచివాలయం నందు అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ వ్యక్తి పైన అయినా నేరము మోపబడినప్పుడు అరెస్టుకు ముందస్తుగా లీగల్ సర్వీసెస్ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందించబడుతుందని కావున కక్షిదారులు ఈ సౌలభ్యం ఉపయోగించుకోవచ్చు అని, అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రైవేటు సంస్థల నందు, కర్మాగారాల నందు, విద్యా సంస్థల నందు లింగ వివక్షత తగదని అందరిని సమానముగా చూడాలని, ఏ వ్యక్తి కానీ ఏ సంస్థ కానీ లింగ వివక్షత చూపించిన చట్టం కఠినంగా శిక్షిస్తుందని తెలియజేశారు అలాగే బాల్య వివాహాల, ఉచిత న్యాయాల పైన అవగాహన కల్పించారు సూర్య చక్రవేణి మాట్లాడుతూ బాలలతో పెట్టి చాకిరీ చేయించరాదని అలాగే భిక్షాటను కూడా తగదని, అటువంటి చర్యలకు పాల్పడిన వారిని చట్టం కఠినంగా శిక్షిస్తుందని, బాధితులకు ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుందని తెలియజేశారు. తదనంతరం ఎంఏఎస్ జడ్పీ హైస్కూలు సందర్శించి విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పదార్థాలను పరిశీలించడం జరిగిందని, అలాగే విద్యార్థులను పాఠశాల యాజమాన్య పనితీరును వసతులపైన ఆరా తీయడం జరిగిందని, ప్రధానోపాధ్యాయులకు తగుల సూచనలు చేయడం జరిగిందని తెలియజేశారు మరియు ఈ కార్యక్రమంలో ఏలూరు రూరల్ ఎమ్మార్వో పి శ్రీనివాసరావు ఎంపీడీవో ప్రణతి మరియు గ్రామ కార్యదర్శి రవీంద్రబాబు పాల్గొన్నారు.

# 17వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

**వీరవాసరం, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

సీఎం జగన్ ఇప్పుడైనా మనసు మార్చుకుని అంగనవాడి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీరవాసరం మండలం అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు సంఘం ఆధ్వర్యంలో 17వ రోజు గురువారం సమ్మె కొనసాగింది ఈ సందర్భంగా అంగన్వాడి వర్కర్స్ సీఎం జగన్ కి వేతనాలు పెంచాలని పోస్ట్ కార్డులు రాస్తూ నిరసన తెలుపడం జరిగింది వారు మాట్లాడుతూ ఇప్పటికైనా సీఎం జగన్ మనసు మార్చుకుని తెలంగాణ కన్నా వెయ్యి రూపాయలు పెంచుతానన్న మాటని నిలబెట్టుకోవాలని సుప్రీంకోర్టు తీర్పుపకారంగా గ్రాడ్యుటి చేయాలని డిమాండ్ చేశారు.



# సర్వ రోగాలకు సంజీవిని ఆయుర్వేదమే




- వనమూలికలతో సర్వ రోగాలు మటుమాయం
- భవిష్యత్తులో ఆయుర్వేదం విరాజిల్లుతుంది
- ఆయుర్వేదాన్ని ప్రభుత్వాలు ప్రోత్సహించాలి
- భవిష్యత్తులో అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవం జరుపుకుంటాం

**చింతూరు, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

సర్వ రోగాలకు సంజీవిని ఆయుర్వేదమేనని ,రానున్న రోజులలో భారతదేశంలో ఆయుర్వేదం విరాజిల్లుతుందని ఆయుర్వేద వైద్యులు అన్నారు.పారంపర్య మహా సంఘం,జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం నిమ్మలగూడెం గ్రామంలోని అఫ్రిన్ ఆయుర్వేద వైద్యశాల ప్రాంగణంలో ఆయుర్వేదం పై నిరంతర వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది.ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఆయుర్వేద వైద్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యులు సురేష్ జకోటియా, జమాల్ ఖాన్,ఆనందయ్య,మహమ్మద్ ఘని మాట్లాడారు.సాంప్రదాయ పారంపర్య వైద్యంతో ప్రజలకు సోకిన రోగాలను తరిమి కొట్టవచ్చని అన్నారు.అల్లోపతి వైద్యానికి తగ్గని రోగాలు సైతం ఆయుర్వేదంతో నయం చేయొచ్చని తెలిపారు.భవిష్యత్తులో ఆయుర్వేదందే రాజ్యమని అన్నారు.రానున్న రోజుల్లో అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవం కూడా జరుపుకుంటామని ఆయుర్వేద వైద్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.ముందుగా రోగికి ఉన్న జబ్బును గుర్తించి ఆయుర్వేదంతో వైద్యం అందిస్తే ఆ రోగం మటుమాయం అవుతుందని అన్నారు.భారతదేశం వనమూలికలకు పుట్టినిల్లు అని,ప్రభుత్వం ప్రోత్సహిస్తే వనమూలికల ద్వారా ప్రజలను రోగాల బారి నుండి కాపాడచ్చని ఆయుర్వేద వైద్యులు సూచించారు.ప్రభుత్వాలు స్పందించి ఆయుర్వేద వైద్యాన్ని ప్రోత్సహిస్తే భారతదేశం ఆరోగ్యకర దేశంగా మారుతుందని ఆయుర్వేద వైద్యులు అన్నారు.ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉన్న పాత్రికేయులు ఆయుర్వేదం పై కథనాలు రాయడంతోనే ఆయుర్వేదం ఇంకా బతికి ఉందని ఆయుర్వేద వైద్యులు అన్నారు. ఆయుర్వేద వైద్యానికి తోడ్పాటు అందించిన పాత్రికేయులను జమాల్ ఖాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శాలువతో సత్కరించి సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు వేణుగోపాల రెడ్డి,ప్రసాద్ రావు,ఎస్ రమేష్,లక్ష్మణ్,ముసబ్దిక్,ఖాజా మస్తాన్,అబ్దుల్ జబ్బర్, భవాని,సుభాని తదితరులు పాల్గొన్నారు.

# గోపన్నపాలెంలో సచివాలయం రైతు భరోసా కేంద్రం ప్రారంభం





**దెందులూరు, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

కరోనా విపత్తు వచ్చినప్పటికీ ఆంధ్రప్రదేశ్ లో ప్రజలందరికీ అన్ని సంక్షేమ పథకాలు కార్యక్రమాలను అందిస్తూ ఎన్నికల అప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దేనని దెందులూరు ఎమ్మెల్యే కొటారు అబ్బయ్య చౌదరి అన్నారు. గురువారం దెందులూరు మండలం గోపన్నపాలెం పంచాయతీ పరిధిలోని వేగవరం గ్రామంలో 24 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం మరియు 46 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ కేంద్రాలను గ్రామపంచాయతీ సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరమ్మ కుమార్ జట్పీటిసీ నిట్టా లీలా నవకాంతం గంగరాజు, మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అంజలి ప్రసాద్ సువ్వా ప్రభుదాస్, ఎంపీడీవో భీమేశ్వరరావు. తాసిల్దార్ నాంచారయ్య. వైసీపీ నేతలు ఏనుగు హేమాసాగర్, కొండేటి బాబు, తోట పద్మారావు, మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు తదితరులు ఉన్నారు.


# యూనివర్సిటీ స్థాయిలో గోపన్నపాలెం వ్యాయామ విద్యార్థుల ప్రతిభ




**దెందులూరు, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

ఆదికవి నన్నయ యూనివర్సిటీవాలీ బాల్ స్థాయి పోటీల్లో గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు యూనివర్సిటీ స్థాయిలోఐదు జిల్లాల జట్ల మధ్య జరిగిన పోటీల్లో గోపన్నాపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యార్థుల విద్యార్థులు ఆర్ సూర్య మణికంఠ, పి సాయికిరణ్, ఎస్ భీమరాజు జిల్లాలో రెండవ స్థానం సాధించారు. ఈ సందర్భంగా గురువారం గోపన పాలెం కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నతానియేల్ విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ ఎస్ ఆర్ యం యూనివర్సిటీ కు ఎంపిక కావటం సంతోషంగా గర్వకారణంగా ఉందన్నారు.

# మావుళ్ళమ్మ అమ్మవారి మూలవిరాట్ పునః దర్శనం ప్రారంభం..



**భీమవరం, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**



మావుళ్ళమ్మ అమ్మవారికి వార్షికోత్సవంలో భాగంగా రంగుల అలంకరణ, నిర్వహణ పనులు పూర్తి చేసి గురువారం నుండి భక్తులకు మూల విరాట్ పునర్దర్శనాన్ని ప్రారంభించారు. ఉదయం 11 గంటలకు కలాన్యాసం, గోవు దర్శనం అనంతరం పునర్దర్శనం ప్రారంభం కాగా, రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, జిల్లా డిసిసి బ్యాంక్ చైర్మన్ పివిఎల్ నరసింహరాజులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయానికి వచ్చిన వీరికి ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలికారు. ఆలయ సహాయ కమిషనర్ ఎర్రంశెట్టి భద్రాజీ,ఆలయ చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు,సిహెచ్ నాగశాస్త్రి,జి విజయలక్ష్మి, తాళ్లపూడి భాగ్యలక్ష్మి, వెంకట రామారావు, రామాయణం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# జేసీని కలిసిన గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్



**గూడూరు రూరల్, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

గతంలో తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పని చేసిన డీకె బాలాజీ బదిలీ నూతన తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన శుభం బన్సల్ ను మర్యాద పూర్వకంగా కలిసిన గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ జెసి కి పుష్ప గుచ్చం అందజేసిన శుభాకాంక్షలు తెలిపిన ఆర్డీవో త్వరలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బదిలీలు జరిగినవి ఇందులో భాగంగా తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న డీ కె బాలాజీ బదిలీ అయ్యారు ఆయన స్థానం లో నూతనంగా శుభం బన్సల్ జాయింట్ కలెక్టర్ గా బుధవారం బాధ్యతలు చేపట్టారు ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ను గూడూరు రెవిన్యూ డివిజనల్ అధికారి ఏం కిరణ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ ను సోమవారం శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు అదేవిధంగా పలువురు అధికారులు సిబ్బంది కుడా జాయింట్ కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలిపారు తెలియజేశారు.

# నగర సుందరీకరణ పనులు పరిశీలించిన కమిషనర్ హరిత



**తిరుపతి, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

నగరంలో జరుగుతున్న కూడళ్ళ సుందరీకరణ పనులను నగరపాలక సంస్థ కమిషనర్ హరిత గురువారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. నగరంలోని పద్మావతీ కళ్యాణమండపం సమీపంలోని నారాయణపురం కూడలి వద్ద ఏర్పాటు చేసిన మత్స్యకారుడి విగ్రహం ఏర్పాటు పనులను పరిశీలించారు. విగ్రహం చుట్టూ గ్రీనరి పెంచి వాటర్ పౌంటైన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ కూడలి వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. గతంలో అక్కడ నుండి తొలగించిన పూర్ణ కుంభం, ఎం.ఎస్.సుబ్బలక్ష్మి, తెలుగుతల్లి విగ్రహాలను ఏర్పాటు చేయాలని అన్నారు. అన్ని కూడళ్లలో కూడా గ్రీనరి, రంగురంగుల పూలతో మొక్కలు ఏర్పాటు చేయాలన్నారు. కరకంబాడి మార్గంలో నగరపాలక సంస్థ పరిధిలోకి వచ్చే వారికి స్వాగతం పలుకుతూ ఏర్పాటు నమస్కారం విగ్రహాన్ని పరిశీలించారు. ఈ పనులన్నీ రెండు మూడు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. కమిషనర్ వెంట డి. ఈ.మహేష్ తదితరులు ఉన్నారు.

# భూహక్కు చట్టానికి రద్దు చేయాలని న్యాయవాదుల బైక్ ర్యాలీ






**శ్రీకాళహస్తి, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

శ్రీకాళహస్తిలో న్యాయవాదులు కోర్ట్ ఆవరణం నుండి శ్రీకాళహస్తి ఆర్డిఓ,ఎం ఆర్ ఓ కార్యాలయాలకు బైక్ ర్యాలీ గా వెళ్లి తమ నిరసనను తెలియజేసిన అనంతరం వినతిపత్రం అందించారు. న్యాయవాదులు మాట్లాడుతూ.. సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేసేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను(భూహక్కు చట్టం )వెంటనే రద్దుచేయాలని కోరారు. ఈ చట్టం ద్వారా సామాన్య ప్రజలు తమ భూమిపై హక్కును కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని,ఈ చట్టం అమలు పరచడం వలన సామాన్యుడు తమ సొంత భూమిని నిరూపించుకోవాలంటే హైకోర్టుకు వెళ్ళాసిన పరిస్థితి ఏర్పడుతుందని, దీనివలన వ్యయ ప్రయాసలు కలిగి ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులకు గురవుతారని వారు తెలియజేశారు. ఈ భూహక్కు చట్టాన్ని రద్దు చేసేవరకు ప్రజలు, రైతుల పక్షాన న్యాయవాదులు నిలబడి పోరాటాలు చేస్తామన్నారు.

# గూడూరు వైసీపీ ఎమ్మెల్యే టికెట్ ఎవరికో ?



**గూడూరు రూరల్, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

స్థానికులకు ఇవ్వాళ లేక వేరే ఇంక్క ఎవరికైనా ఇవ్వాళ గూడూరు ప్రజలు మాత్రం స్థానికుల ఇస్తే బాగుంటుంది అంటున్నారు వైసీపీ అధిష్టానం కూడా స్థానికత అనే ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకొని ఆలోచిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. స్థానికంగా ఉండి ఎవరు ఎమ్మెల్యే టికెట్ కోసం పోటీలో ఉన్నారు వాళ్ళు పార్టీలో ఎన్ని సంవత్సరాల నుండి పనిచేస్తున్నారు వారి ప్రస్తుత రాజకీయ పరిస్థితి ఏంటి అనే విషయాలపై కూడా వైసిపీ అధిష్టానం ఆరా తీస్తున్నట్లు సమాచారం. స్థానికంగా ఉండి పార్టీ కోసం పనిచేస్తూ, గూడూరు ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న వారిలో ముఖ్యులు బత్తిని విజయ్ కుమార్ మన్నెం శీనయ్యలు బత్తిని విజయ్ కుమార్ వైసీపీ పార్టీ ఆవిర్భావం నుండి కార్యకర్తస్థాయి నుండి పనిచేస్తూ రాష్ట్ర నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి బత్తిని విజయ్ కుమార్ పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ అనునిత్యం ప్రజల్లో ఉండే వ్యక్తి బత్తిని విజయ్ కుమార్ అంతే కాకుండా వైఎస్ ఆర్ సేవా సమితి పేరుతో ఎన్నో సేవా కార్యక్రమాలు కూడా చేసిన వ్యక్తి నియోజకవర్గం లో గుర్తింపు ఉన్న వ్యక్తి బత్తిని విజయ్ కుమార్ 2014 శాసనసభ ఎన్నికలలో ఎమ్మెల్యే టికెట్ తన ఇంటి దాకా వచ్చినా బత్తిని విజయ్ కుమార్ తనకే టికెట్ కావాలి, ఇంట్లో వాళ్ళకు వద్దు అని చెప్పడంతో ఆ సమయంలో టికెట్ కాస్తా స్థానిక అభ్యర్థి పాశం సునీల్ కుమార్ కి ఇచ్చినట్లు సమాచారం అయినా పట్టువదలని విక్రమార్కుడిలా 2019 ఎన్నికలలో కూడా బత్తినికే టికెట్ అనుకుంటున్న సందర్భంలో తిరుపతి ఎంపీ గా ఉంటూ సమైక్యంధ్ర కోసం ఎంపీ పదవికి రాజీనామా చేసిన వరప్రసాద్ రావ్ కి ఎమ్మెల్యే గా టికెట్ ఇచ్చిన అధిష్టానం కానీ ప్రస్తుత పరిస్థితులలో గూడూరు నియోజకవర్గం లోని వైసీపీ నాయకులు కార్యకర్తలు స్థానికంగా ఉండే వ్యక్తి కి గూడూరు టికెట్ ఇవ్వాలని సందేశాలు పార్టీ అధిష్టానం కి తెలపడంతో దానికి స్పందించిన పార్టీ అధిష్టానం స్థానికులుకే టికెట్ ఇచ్చే యోచనలో ఉండటం తో ఈసారి కచ్చితంగా టికెట్ నాకే వస్తుంది అని బత్తిని విజయ్ కుమార్ ధీమా మన్నెం శీనయ్య చిల్లకూరు మండలం నాంచారమ్మా పేట దళిత కుటుంబం లో పుట్టిన మన్నెం శీనయ్య డిగ్రీ చదువుకొని ఆ తరువాత లాయర్ పట్టా కష్టపడి సంపాదించి గూడూరు కోర్టు లో ప్రాక్టీస్ మొదలుపెట్టి పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు తక్కువ ఫీజు తీసుకొని సేవ చేసేవ్యక్తి మన్నెం శీనయ్య రాజశేఖరరెడ్డి తనయుడు ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పార్టీ పెట్టిన కొంత కాలానికి ఆయన ఆశయాలు ఆలోచనలు నచ్చి రాజకీయాల్లోకి రావడం ముత్యాలపాడు పంచాయతీ సర్పంచ్ గా గెలిచి, పంచాయతీ లో సమస్యలు తెలుసుకొని పరిష్కారం చేస్తూ ప్రజల్లో తనకంటూ స్థానం సంపాదించుకున్న వ్యక్తి ఆ తరువాత 2019 ఎన్నికలలో గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపు కోసం అహర్నిశలు శ్రమించి చిల్లకూరు మండలంలో ని నాయకులు కార్యకర్తలు అందరూ కలిసి మంచి మెజారిటీ ఇవ్వడం లో మన్నెం శీనయ్య కీలకపాత్ర పోషించారు ఆ తరువాత వచ్చిన జడ్పీటీసీ ఎన్నికలలో ఈయన పార్టీ కి చేసిన సేవలను గుర్తించి గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ రావ్ జిల్లా పార్టీ అధ్యక్షులు కి చెప్పి చిల్లకూరు జడ్పీటీసీ



అభ్యర్థి గా టికెట్ ఇప్పించడంతో చిల్లకూరు మండలం లో తనకు వైసీపీ నాయకులు, కార్యకర్తతో ఉన్న అనుబంధం కలుపుకొని పోయే లక్షణాలు ఉండటంతో గెలుపు అతనికి సులభం అయింది అప్పటినుండి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆశయాలు ఆలోచనలు ఆయన ప్రకటించిన నవరత్నాలు పథకాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్తున్న వ్యక్తి చిల్లకూరు జడ్పీటీసీ మన్నెం శీనయ్య ప్రస్తుతం ఎమ్మెల్యే కి గూడూరు టికెట్ ఇవ్వని పక్షం లో తన కి సన్నిహితుడైన మన్నెం శీనయ్య కి గూడూరు టికెట్ ఇవ్వాలని పార్టీ అధిష్టానం కి ఎమ్మెల్యే వరప్రసాద్ రావు చెప్పినట్లు సమాచారం ఈయన కు గూడూరు ఎమ్మెల్యే ఆశీస్సులు, అండదండలు పుష్కలంగా ఉండటం నియోజకవర్గం లోని అన్నీ వర్గాల నాయకులు కార్యకర్తలు అభిమానం ఉండటం మరీ ముఖ్యం గా చిల్లకూరు రెడ్లు ఆశీస్సులు ఉండటంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి స్థానికుడినైన తనకు గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి గా టికెట్ ఇస్తారనే ఆశతో ఉన్నారు. గూడూరు వైసీపీ ఎమ్మెల్యే టికెట్ స్థానికులకే ఇస్తారో స్థానికేతరులకే ఇస్తారో అసలు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మనసులో ఏముందో అంటున్నారు గూడూరు ప్రజలు.

# భవానీనగర్ రోడ్డు పనులను వేగవంతం చేయండి : కమిషనర్ హరిత

**తిరుపతి, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**



తిరుపతి టీటీడీ పరిపాలనా భవనం ప్రక్కన భవానీనగర్ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత గురువారం పరిశీలించి పనులు వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేసారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడు తూ తిరుపతి టీటీడీ పరిపాలనా భవనం ప్రహరి గోడను ఆనుకొని భవానీనగర్ గుండా రైల్వే కాలనీ వైపుగా 500 మీటర్ల పొడవుతో వెలుతున్న కాలువను నూతనంగా నిర్మించడం జరుగుతున్నదని, అనంతరం దానిపై స్లాబ్ వేసి రోడ్డును నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ రహదారి పూర్తి అయితే చుట్టు ప్రక్కల చాలా ప్రాంతాలకు సౌకర్యవంతమైన రహదారిగా ఏర్పడుతుం దన్నారు. ఇప్పటికే కాలువను పటిష్టంగా నిర్మించి, దానిపై స్లాబ్‌ను వేయడంతో బాటు సిసి రోడ్డును నిర్మించే పనులు కూడా తుది దశకు చేరుకుంట్టున్నట్టు తెలిపారు. లైటింగ్ వేసేందుకు దిమ్మెలు కూడా నిర్మించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అధికారులకు సూచనలు జారీ చేస్తూ రోడ్డు నిర్మాణ పనులపై నిరంతర పర్యవేక్షణ వుండాలని, పండుగలోపు అన్ని పనులు పూర్తి చేసి రోడ్డు ప్రారంభోత్సవానికి సిద్దం చేయించాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశాలు జారీ చేసారు. కమిషనర్ వెంట తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ మునిసిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డిఈ విజయకుమార్ రెడ్డి, కాంట్రాక్టర్ సహాన్ ఉన్నారు.

# టీడీఆర్ వివరాలపై సమీక్షించిన కమిషనర్ హరిత

**తిరుపతి, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**



తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని మాస్టర్ ప్లాన్ రోడ్ల కోసం జారీ చేసిన టిడిఆర్, ట్రాన్సఫరబల్ డెవెలప్‌మెంట్ రైట్స్ వివరాలు పూర్తి స్థాయిలో సిద్దం చేయాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గిఫ్ట్ డిడ్ వివరాలను ఓక క్రమపద్దతిలో ప్రభుత్వం జారీ చేసిన ఎస్.ఓ.పి పద్దతిన సిద్దం చేయాలన్నారు. ఇప్పటికే టిడిఆర్ స్క్రూటిని కమిటి సమావేశంలో ఈ విషయాలపై చర్చించడం జరిగిన విషయాన్ని ప్రస్థావిస్తూ త్వరలో జరగబోవు స్క్రూట్ని కమిటి సమావేశానికి టిడిఆర్, గిఫ్ట్ డిడ్ ల పూర్తి వివరాలతో సిద్దంగా వుండాలని కమిషనర్ హరిత ఆదేశాలు జారీ చేసారు. ఈ సమీక్షా సమావేశంలో తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, సర్వేయర్లు, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

**శ్రీకాళహస్తి, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**



ఈరోజు కాంగ్రెస్ పార్టీ 138 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భం గా ఏపీసీసీ జనరల్ సెక్రటరీ మరియు శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్.ఎస్.బత్తైయ్య నాయుడు కాంగ్రెస్ పార్టీ ఆఫీసు నందు కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. తదుపరి గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తదుపరి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని స్థాపించిన వ్యక్తి ఒక బ్రిటిష్ వాడని దానిని కాపాడుకుంటూ స్వతంత్ర సమరయోధులు అధ్యక్షులుగా ఉంటూ 1947 ఆగస్టు 15న పూర్తి స్వాతంత్రాన్ని గాంధీజీ నాయకత్వంలో జవహర్ లాల్ నెహ్రూ,పటేల్, అంబేద్కర్ వంటి వారి కృషితో స్వాతంత్రాన్ని సంపాదించుకోవడం జరిగింది. మొదటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ కృషితో దేశంలో ప్రజాస్వామ్యాన్ని సంపాదించుకొని మతతత్వం లేని స్వచ్ఛమైన సమాజాన్ని నిర్మించారని, దేశానికి ఇండస్ట్రీస్ తేవడం జరిగింది అన్నారు,భారీ డ్యాములు వ్యవసాయం కోసం తెచ్చారన్నారు. రాబోయే 2024 ఎన్నికలలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయాలని డాక్టర్. ఎస్. బత్తైయ్య నాయుడు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలోబీ బివి. శేఖర్, ఎం. వెంకట ముని, తుమ్మ. శివకుమార్, ఎం. వడివేలు మొదలియా, చిరంజీవులు, టీ.రాఘవరెడ్డి, ఈ. గోపి, ఎస్. శివయ్య, ఎస్. నాగూర్ అయ్యా, పి. కేశవులు, పి. సురేష్, టి మోహన,వెంకటయ్య, వానమ్మ, బానమ్మ, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత పశువైద్య శిబిరం



**బాలాయపల్లి, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

రిలయన్స్ ఫౌండేషన్, పశుసంవర్ధక శాఖ ఆద్వ ర్యంలో మండలంలోని మన్నూరు గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం గురువారం నిర్వహిం చారు.ఈసందర్భంగా గొర్రెలు,మేకలకు 310, ఆవు లు గేదెలకు 35 ,దూడలు 20లకు నట్టల నివార ణ మందులు పంపిణిచేశారు.ఇక గొర్రలు కు నోటి పుండ్లు,నీలి నాలుక ,జనరల్ చెక్‌ఆప్ వైద్యం చేసి ఆవులు, గేదెలకు సూడి పరీక్షలు నిర్వహిం చారు.అనంతరం రిలయన్స్ ఫౌండేషన్ ఆద్వ ర్యంలో ఉచితంగా మందులు సరఫరా చేసినారు. పాడి రైతులకు పశువుల ఆరోగ్యం పైన తీసుకో వలసిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పిం చారు. రిలయన్స్ ఫౌండేషన్ సమాచార సేవలు పంటలకు,పశువులకు సంబంధించిన సూచనలు సలహాలు, వాతావరణ వివరములు టోల్ ఫ్రీ నెం. 18004198800 ఫోన్ చేసి మీరు సమా చారం పొందవచ్చా న్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి.సుధీర్, రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ సపోర్టర్ వెంకటరమణ, ఏహెచ్‌ఏ వంశీ, రైతులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సంక్షేమం విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు

- ఉద్యోగులతో విడదీయరాని బంధం
- టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి
- ఈ ప్రభుత్వం వల్లే ఉద్యోగుల కల సాకారమైంది : టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి
- ముఖ్యమంత్రివర్యులకు, టీటీడీ చైర్మన్‌కు రుణపడి ఉంటాం : టీటీడీ ఉద్యోగులు
- మహతిలో వేడుకగా టీటీడీ ఉద్యోగులకు ఇంటి పట్టాల పంపిణీ పండుగ





**తిరుపతి, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

ఉద్యోగుల సంక్షేమం, ధార్మిక ప్రచారంలో వెనుకడుగు వేసేది లేదని టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. ఎన్ని విమర్శలు ఎదురైనా కార్మికులకు, ఉద్యోగులకు మేలు చేయడంలో వెనక్కు తగ్గే ప్రసక్తి లేదని ఆయన చెప్పారు. టీటీడీ ఉద్యోగులకు ఇంటి పట్టాల పంపిణీ పండుగ కార్యక్రమం గురువారం ఉదయం తిరుపతి మహతి ఆడిటోరియంలో వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీటీడి చైర్మెన్, తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ వేలాదిమంది ఉద్యోగులకు తన చేతుల మీదుగా ఇంటి స్థలాలు పంపిణీ చేయడం ఎంతో ఆనందం కలిగించిందన్నారు. తన జీవితంలో ఇది మహదానందం కలిగించిన రోజని ఆయన చెప్పారు. 17 సంవత్సరాల క్రితం తాను టీటీడీ చైర్మన్ గా ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డిని కలిసి ఉద్యోగుల ఇళ్ల స్థలాల విషయమై చర్చించినట్లు చెప్పారు. తన ఒత్తిడి వల్లే ఉద్యోగులకు ఇంటిస్థలాలు మంజూరు చేసినట్లు 2009లో వైఎస్ రాజశేఖరరెడ్డి ఇదే వేదిక మీద తెలియజేశారని ఆయన గుర్తు చేశారు. తాను ఆరో తరగతి నుంచి డిగ్రీ దాకా టీటీడీ విద్యాసంస్థల్లోనే చదివానని ఆయన చెప్పారు. ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు తన ద్వారా సాధించే రోజు రావాలనే కోరిక దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో సాకారమైనందుకు ఆనందంగా ఉందన్నారు. ఉద్యోగులందరికీ ఇంటి స్థలాలు ఇప్పించే విషయం గురించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తాను సంప్రదించినప్పుడు ఆయన ఉద్యోగులందరికీ ఉచితంగా ఇంటి స్థలాలు ఇద్దామని చెప్పారన్నారు. అయితే చట్ట ప్రకారం ఇందులో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగానే నామమాత్రపు ధరతో ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులందరికీ కూడా ఇంటి పట్టాలు మంజూరు చేయడానికి ముఖ్యమంత్రి అంగీకరించారన్నారు. ఈ కార్యక్రమాన్ని సాకారం చేయడంలో ఈఓ ధర్మారెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, ఇతర కార్యనిర్వాహకవర్గం తనకు చేదోడు వాదోడుగా ఉండి ముందుకు నడిపించారని చైర్మన్ భూమన అభినందించారు. పాగాలి వద్ద 350 ఎకరాల భూమి టీటీడీకి ఇవ్వడంలో జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి కృషి కూడా అభినందనీయమన్నారు. ఇందుకోసం బుధవారం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో 87 కోట్ల రూపాయలు మంజూరు చేయించడంలో ఈవో ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ఉద్యోగులతో తమకున్న బంధాన్ని విడదీయలేరని కరుణాకర రెడ్డి స్పష్టం చేశారు. తాను పేరు కోసం కాకుండా బాధ్యతతో ఈ కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో నిర్వహించానన్నారు. తాను రాజకీయాల్లో ఉండడం వల్లే ఎమ్మెల్యేగా, చైర్మన్ గా అయ్యానని, ఈ పదవులు రావడం వల్లే పేదల కోసం, ఉద్యోగుల కోసం తాను నిస్వార్ధంగా పనిచేయగలుగుతు న్నానని ఆయన చెప్పారు. ఎన్నో ప్రభుత్వాలు ఉద్యోగుల ఇళ్ల స్థలాల విషయం గురించి చూస్తాం, చేస్తామని చెప్పారు కానీ చేసింది మాత్రం వైయస్ రాజశేఖర్ రెడ్డి, వైయస్ జగన్మోహన్ రెడ్డి అని ఆయన చెప్పారు. ఈ విషయాన్ని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఎప్పుడూ గుర్తుంచుకోవాలని కోరారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వల్లే టీటీడీలో పారిశుద్ధ్య కార్మికులకు రూ.5000, పోటు కార్మికులకు పది వేల రూపాయల జీతం పెంచగలిగామని చెప్పారు. అలాగే వాహనం బేరర్లు, ఉగ్రాణం కార్మికులను స్కిల్డ్ లేబర్ గా గుర్తించి వారికి కూడా జీతాలు పెంచగలిగే ఏర్పాటు చేయగలిగామన్నారు. ఉద్యోగులు తనను శాసనసభ్యుడుగా కాకుండా మీలో ఒకరిగా చూపిస్తున్న ప్రేమను కలకాలం గుండెల్లో దాచుకుంటానని చెప్పారు. ఉద్యోగుల సంక్షేమం కోసం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న సేవను గుర్తించుకోవాలన్నారు. పాలకమండలి నుంచి కిందిస్థాయి ఉద్యోగులందరూ కూడా శ్రీ వేంకటేశ్వర స్వామి దయతోనే ఇక్కడ ఉన్నామనే విషయాన్ని గుర్తించి భక్తులకు మెరుగైన సేవలు అందించాలని ఆయన పిలుపునిచ్చారు. టీటీడీ ఈవో ఏ.వి ధర్మారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాలు మంజూరు చేసేలా ఉత్తర్వులు ఇచ్చారని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాల కోసం 210 కోట్ల రూపాయలు ఉద్యోగుల తరపున చెల్లించడం చారిత్రాత్మకమని ఆయన చెప్పారు. పాగాలి వద్ద 350 ఎకరాలు త్వరలోనే స్వాధీనం చేసుకుని జనవరి చివరి నాటికి టీటీడీలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికీ ఇంటి స్థలం ఇప్పించే ఏర్పాటు చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ధర్మకర్తల మండలి అధ్యక్షులు కరుణాకర రెడ్డి సహృదయంతో టీటీడీ ఉద్యోగులకు ఎంతో లబ్ధి కలిగిందని ఆయన అన్నారు. వడమాలపేట దగ్గర ప్రస్తుతం ఉద్యోగులకు ఇస్తున్న ఇంటి స్థలం మార్కెట్ విలువ 40 లక్షల రూపాయలకు చేరుకుందని ఆయన చెప్పారు. ప్రభుత్వం, ధర్మకర్తల మండలి ద్వారా ఎంత మేలు జరిగిందో ఉద్యోగులు గుర్తించాలన్నారు. హెచ్.బి.ఎల్ వారికి కూడా ఇంటి స్థలాలు ఇస్తామని, రెండో విడతగా మరో 15 రోజుల్లో ఇంటి స్థలాల పంపిణీ కార్యక్రమం మహతి ఆడిటోరియంలోనే నిర్వహిస్తామని చెప్పారు. ఉద్యోగులు భక్తుల సేవే ముఖ్యంగా పనిచేయాలన్నారు. భక్తులు హుండీ ద్వారా స్వామివారికి సమర్పిస్తున్న కానుకల వల్లే తమ కుటుంబాలు జీవిస్తున్నాయన్న విషయం గుర్తించి స్వామి సేవలో, భక్తుల సేవలో అంకితం కావాలని పిలుపునిచ్చారు. వైకుంఠ ద్వార దర్శనం 10 రోజుల్లో ఎప్పుడు చేసుకున్నా ఒకటే ఫలితం లభిస్తుందనే విషయం ఉద్యోగులు గుర్తించి వైకుంఠ ఏకాదశి, ద్వాదశి నాడు భక్తుల కోసం సేవ చేసి, మూడవ రోజు నుంచి పదవరోజు దాకా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు వైకుంఠ ద్వార దర్శనం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ విధానం కొనసాగించేలా కృషి చేయాలని ఉద్యోగులకు ఆయన పిలుపునిచ్చారు. ఉద్యోగుల సంక్షేమం కోసం టీటీడీ అత్యంత ప్రాధాన్యతనిస్తుందని చెప్పారు. ఇందులో భాగంగానే 800 అప్పీళ్లను కొత్త బోర్డు వచ్చాక పరిష్కరించామని, భవిష్యత్తులో డిఏ కేసులు లేకుండా ఉండేలా ఉద్యోగులు పనిచేయాలని కోరారు. అనంతరం సీనియర్ అధికారుల సంఘం తరపున టీటీడీ పీఆర్వో డా.తలారి రవి, పలువురు ఉద్యోగులు ప్రసంగించారు. ఆ తరువాత టీటీడీ చైర్మన్, ఈవో చేతుల మీదుగా ఉద్యోగులకు ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్ఓ నరసింహ కిషోర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గూడూరు ప్రింట్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ ఆవిర్భావ సదస్సు








- జర్నలిస్టుల సంక్షేమానికి సహకరిస్తాం : మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్
- ప్రజాస్వామ్య పరిరక్షణలో పత్రికా విలేకరుల పాత్ర ప్రశంసనీయం : జెడ్పీటీసీ ఊటుకూరు యామిని
- జర్నలిస్టులు వృత్తి నైపుణ్యం, విలువలు, వ్యక్తి గత సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలి : ఆర్టీఓ ఆదినారాయణ

**గూడూరు, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలో గురువారం గూడూరు ప్రింట్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ ఆవిర్భావ సదస్సు ఆ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్. జమాలుల్లా అధ్య క్షతన విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, జెడ్పీటీసీ ఊటుకూరు యామినిలు, విశిష్ట అతిథిగా ఆర్టీఓ గంగవరపు ఆదినారాయణ, ప్రత్యేక ఆహ్వానితులుగా రూరల్ సీఐ దశరథరామారావు, శ్రేయా రియల్ ఎస్టేట్ ప్రతినిధి బాలాజీ, తిరుపతి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పంటా శ్రీనివాసులు రెడ్డి, సీపీఐ పట్టణ కార్యదర్శి షేక్.కాలేషా, ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ తదితరులు హాజరయ్యారు. ఆహ్వానితులు ప్రింట్ మీడియా అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. వారి చేతుల మీదుగా జర్నలిస్టులకు 10 లక్షలు రూపాయలు భద్రతతో పోస్టల్ ప్రమాద భీమా కార్డులను అందించారు. తొలుత దివంగతులైన జర్నలిస్టులకు నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి జర్నలిస్టులు వారధులన్నారు. వాస్తవాలకు ప్రాధాన్యత ఇస్తూ విలువలకు పెద్ద పీట వేయాలన్నారు. పరిష్కారానికి నోచుకోని ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాలన్నారు. గూడూరు అభివృద్ధికి పాటుపడాలని కోరారు. పార్టీలకతీతంగా పక్షపాతం లేకుండా అన్ని రాజకీయ పార్టీలకు వార్తలు రాయడంలో సహకరించాలన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి గూడూరు ప్రింట్ మీడియా అసోసియేషన్ కు 50 వేల రూపాయలను తన సొంత నిధులను ఇస్తామని సభికుల కరతాళ ధ్వనుల నడుమ ప్రకటించారు. ఈ హామీ ప్రకటించడం తో ఆయనకు ప్రింట్ మీడియా అసోసియేషన్ కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీఓ గంగవరపు ఆదినారాయణ మాట్లాడుతూ నిత్యం వృత్తి బాధ్యతలతో పని ఒత్తిడిలో ఉండే విలేకరులు వ్యక్తి గత జీవన భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాన్నారు. విలువలతో కూడిన జర్నలిజంతోనే స్వాతంత్రోద్యమ కాలం నుంచి నేటి వరకూ అనేక సంస్కరణలు సాధ్యమయ్యాయన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ రోడ్డు రవాణా శాఖకు సహకరించాలని సూచించారు. జడ్పి టీసీ ఊటుకూరు యామినీ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో పత్రికా విలేకరుల పాత్ర ప్రశంసనీయమన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో విలేకరుల శ్రమ ఆదర్శనీయమన్నారు. రూరల్ సీఐ దశరథ రామారావు మాట్లాడుతూ ప్రజల కష్టాలను, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం, వారి సమస్యలను పరిష్కరించే చర్యలు చేపట్టడంలో పత్రికా విలేకరుల సహకారం అభినందనీయమన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పంటా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ప్రింట్ మీడియా అసోసియేషన్ దీర్ఘకాలం కొనసాగి గూడూరు పత్రికా విలేకరుల సంక్షేమ కార్యక్రమాలు విరివిగా కొనసాగాలని ఆకాంక్షించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి షేక్ కాలేషా మాట్లాడుతూ ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని జర్నలిజంలో కొనసాగుతున్న పాత్రికేయ మిత్రులను అందరినీ గౌరవించుకునేలా అసోసియేషన్ నిర్మాణం చేపట్టడం అభినదించదగిన సంస్కృతి అన్నారు. గూడూరు ప్రింట్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ జమాలుల్లా సభాధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి ఉడతా శరత్ యాదవ్ వందన సమర్పణతో సదస్సు ముగిసింది. జామాలుల్లా,శమీజూరు మల్లిఖార్జునరావు, శరత్ యాదవ్ లు మాట్లాడుతూ గూడూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేఖరుల ఐక్యత, పత్రికా విలేఖరుల హక్కుల సాధన, విలువలు పరిరక్షణ, సంక్షేమమే లక్ష్యంగా సంస్థ పనిచేస్తుందని ఉద్ఘాటించారు. ఈ సమావేశానికి ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అసోసియేషన్ ప్రతినిధులు నివాళులు అర్పించారు. అదేవిధంగా దివంగత జర్నలిస్ట్ లకు నివాళులు అర్పించి స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఊటుకూరు యామిని, శ్రేయ రియల్ ఎస్టేట్ లిమిటెడ్ మేనేజర్ బాలాజీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పంటా శ్రీనివాసులురెడ్డి, టీడీపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు, కొండూరు వెంకటేశ్వర్లు రాజు, తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు ఎండీ. అబ్దుల్ రహీం, ఇజ్రాయెల్ కుమార్, పల్లి కోటేశ్వరరావు, ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, పూల చంద్రశేఖర్, రోటరీ క్లబ్ పాస్ట్ గవర్నర్ కొణిదెల మునిగిరీష్, అసిస్టెంట్ గవర్నర్ మయూరి శ్యామ్ యాదవ్, సీపీఐ నాయకులు షేక్ కాలేషా, సీవీఆర్. కుమార్, ఎంబేటి చంద్రయ్య, బీసీ నాయకులు నాశిన భాస్కర్ గౌడ్, వైసీపీ నాయకులు జీ. జలీల్, బట్టా గోపి, కాంగ్రెస్ నాయకులు మోదూరు శ్రీనివాసాచారి, మైనారిటీ నాయకులు జీలానీబాష, ఆర్ఎస్కే జీలానీ, ప్రింట్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సీహెచ్. సునీల్ కుమార్, శివతోపాటు, వివిధ పత్రికలు, మీడియా ఛానెళ్ల మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కూలీలకు కూలి 272 గిట్టాలి : ఎంపీడీవో



**బాలాయపల్లి, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పనులకు సంబంధించి కూలీలకు వేతనం రూ 272 రూపాయలు గిట్టేలా కొలతలు ఇవ్వాలని ఎంపీడీఓ ప్రమీలా రాణి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఉన్న స్త్రీ శక్తి భవనంలో నిడుగల్లు, బైరవరం చిలమనూరు, వెంగమాంబ పురం, హస్త కావేరి, కయ్యూరు, కామకూరు, గొట్టికాడు గ్రామ పంచాయతీల మేట్లు ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి కొలతపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్లు కూలీలు కంటే ముందుగా పనులు వద్దకు చేరుకొని ఆ పనులకు సంబంధించిన కొలతలు మార్కింగ్ చేసి ఆ పనులు చేయిస్తే కూలీలకు కూలి గిట్టు తుందన్నారు. అంతేకాకుండా పనులు వద్ద ప్రమాదాలు జరిగితే ఉపాధి హామీ పథకం ఆసుపత్రిక అయ్యే ఖర్చు భరిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీఓ మృత్యుం జయ రావు,కరుణాకర్ రెడ్డి ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## మొహంజోదారు నుంచే ఆధునిక నాగరికతకు వచ్చాం





- శ్రీ విద్యానికేతన్‌లో మొహంజోదారో నాగరికత కాలం నాటి నమూనా ప్రదర్శన

**చంద్రగిరి, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

మానవుడి జీవితం మొహంజోదారు నుంచే నేటి ఆధునిక నాగరికతకు సంక్రమించిందని ముంబైలోని ఎడ్యుకేషన్ వరల్డ్ సి.ఈ.ఓ బవిన్ షా అన్నారు. చంద్రగిరి మండలం ఏ రంగంపేట సమీపంలోని శ్రీ విద్యానికేతన్ విద్యాసంస్థలలో మొహంజోదారు 100 సంవత్సరాల సంభరాలలో రెండవ రోజైన గురువారం మొహంజోదారు కాలం నాటి వస్తువుల నమూనాలను చిత్రాలను ప్రదర్శించే ఎగ్జిబిషన్ ప్రారంభించారు. తయారు చేసిన ముద్రికలను చూసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాచీన కాలంలో నాగరిక పట్టణాలన్నీ నది లోయ ప్రాంతాలలో పురుడు పోసుకున్నాయని చెప్పారు. ఆనాటి కాలంలో ప్రకృతిని పూజించే వారిని తెలియజేశారు. వర్తకమాణిక్యం ఎంతో చక్కగా సాగేదన్నారు. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ అమరేంద్ర నాథ్ మాట్లాడుతూ పురాతన నాగరికత కాలంలో నిప్పును కనిపెట్టి ఆహారాన్ని రుచికరంగా తినటం పత్తిని మూలుగా మార్చటం బట్టలను ధరించటం వంటివి నేర్చుకున్నాడని చెప్పారు. ఆనాటి మనిషి తాను వాడిన పనిముట్లను తమ కాలం నుంచి మనం తీయగలిగామని వాటిని పలు మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచారని గుర్తు చేశారు. మట్టితోనే కాక వివిధ రకాల లోహాలతో పాత్రలను తయారు చేయగలిగారని ఆయన వివరించారు. ఎం బి యు కులపతి డాక్టర్ మోహన్ బాబు మొహంజోదారు నూరు సంవత్సరాల ఉత్సవాన్ని తమ విద్యాసంస్థలలో జరుపుకోవడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. తమ విద్యార్థులు పురాతన నాగరికత పైన అవగాహన పెంచుకోవటం చెప్పరాని ఆనందంగా ఉందని చెప్పారు. అలనాటి నాగరికత వస్తువుల నమూనాలను తయారు చేయడంలో ప్రదర్శించడంలో విద్యార్థుల సృజనాత్మకత ఎంతో గొప్పదని కొనియాడారు అతిథులను మెమెంటోళ్ళతో శాలవులతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు బహుమతులు అందించారు ఈ కార్యక్రమంలో శ్రీ విద్యా నికేతన్ ప్రిన్సిపాల్ రాజేష్ పటేల్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## తాత్కాలిక రెజ్లింగ్ కమిటీని నియమించిన భారత ఒలింపిక్ సమాఖ్య

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (ఐఒసి) తాత్కాలిక రెజ్లింగ్ బాడీ (అడహక్ కమిటీ)ని నియమిస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. రెజ్లర్ల ఆందోళనలకు తలగ్గిన కేంద్రం డబ్ల్యుఎఫ్ఐకి ఎన్నికైన నూతన కమిటీని రద్దు చేసిన సంగతి తెలిసిందే. భూపీందర్ సింగ్ బజ్వా నేతృత్వంలో ఐఒసి తాత్కాలిక కమిటీ (అడహక్ కమిటీ)ని నియమించింది. ఎంఎం. సౌమ్య, మంజూష కన్వర్‌లు అడహక్ కమిటీలో సభ్యులుగా కొనసాగుతారని ప్రకటించింది.డబ్ల్యుఎఫ్ఐలో న్యాయమైన, జవాబుదారీతనం, పారదర్శకత్వాన్ని నిర్ధారించడానికి ఈ అడహక్ కమిటీని నియమించినట్లు ఐఒఎ తెలిపింది. డబ్ల్యుఎఫ్ఐకి ఇటీవల ఎన్నికైన అధ్యక్షుడు, అధికారులు రెజ్లింగ్ రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించడంతో పాటు ఏకపక్ష నిర్ణయాలను తీసుకున్నారని ఐఒసి చీఫ్ పిటి.ఉషా లేఖలో పేర్కొన్నారు. ఐఒసి ప్రతిపాదించిన సుపరిపాలన సూత్రాలకు వ్యతిరేకంగా, తగిన ప్రక్రియను అనుసరించ కుండా నియంతృత్వంగా వ్యవహరిం చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ సింగ్ సన్నిహితుడు సంజరు సింగ్ డబ్ల్యుఎఫ్ఐ చీఫ్‌గా ఎన్నికైన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికలపై రెజ్లర్లు ఆవేదన వ్యక్తం చేశారు. రెజ్లింగ్‌కు సాక్షి మాలిక్ రిటైర్మెంట్ ప్రకటించగా, మరో రెజ్లర్ బజరంగ్‌పూనియా పద్మశ్రీని వెనక్కి ఇచ్చేశారు. మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ సింగ్ నివాసం నుండే డబ్ల్యుఎఫ్ఐ కార్యాలయం పనిచేస్తోందని వినేష్ ఫోగట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖేల్‌రత్న, అర్జున అవార్డులను వెనక్కి ఇచ్చేస్తున్నట్లు ప్రకటించారు.

# నియోజకవర్గం అభివృద్ధి మీచేతుల్లో ఉంది

- మీరెందుకు అభివృద్ధి చేయలేదు...చేయనివ్వలేదు
- చిన్నగొట్టుగల్లులో టీడీపీ, జనసేన ఇంటి ఇంటికి ప్రచారం
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగుతూ
- "మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని"...."బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ" కార్యక్రమం
- యువ నాయకుడు పులివర్తి వినీల్

**చిన్నగొట్టుగల్లు, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం,చిన్నగొట్టుగల్లు మండలం, దిగవూరు పంచాయతీలోని, గాండ్లపల్లి, శాంతినగర్ లలో "మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని", "బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ" కార్యక్రమం మండల నాయకులు నిర్వహించారు. కార్యక్రమానికి చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని కుమారుడు పులివర్తి వినీల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వినీల్‌కు టిడిపి,జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు గజమాలతో స్వాగతం పలికారు. మహిళలు హారతులు బట్టి ఘన స్వాగతం పలికారు. యువత టపాకాయలు కాలుస్తూ ఘనంగా స్వాగతం పలికారు. పులివర్తి నానికి జై అంటూ నినాదాలు చేశారు. పులివర్తి వినీల్ ఇంటి ఇంటికి ప్రచారాన్ని ప్రారంభించారు. చంద్రగిరి నియోజకవర్గం అభివృద్ధిలో చాలా వెనుకబడి ఉందని, 2024 ఎన్నికలలో పులివర్తి నానికి ఒక్క అవకాశం ఇచ్చి ఎమ్మెల్యే గా గెలిపించాలని ఆయన కోరారు. నియోజకవర్గ అభివృద్ధి ప్రజల చేతుల్లో ఉందని ఒక్క అవకాశంతో 25 సంవత్సరాల చరిత్రను తిరగరాసి అందరూ చెప్పుకునే విధంగా అభివృద్ధి చేద్దామని వినీల్ పిలుపునిచ్చారు. పంచాయతీలోని పలు సమస్యలను పులివర్తి వినిల్ కు వివరించారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే నియోజకవర్గ అభివృద్ధి, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని, పంచాయతీ సమస్యలను గెలిచిన నెలల లోపు పరిష్కరిస్తామని వినీల్ తెలిపారు. పులివర్తి వినీల్ ఇంటి ఇంటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ... ఆత్మీయ పలకరింపుతో కరపత్రాలు పంచుతూ సమస్యలను తెలుసుకుంటూ భరోసా కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రజాసేవకై వచ్చిన మోహిత్‌ను.. ఆశీర్వదించండి

- తండ్రికి తగ్గ తనయునిగా మీ అందరికీ సేవ చేస్తాడు
- గడప గడపలో చెవిరెడ్డి లక్ష్మీ విజ్ఞప్తి



**తిరుపతి రూరల్, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

"గత పదేళ్లుగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని ఎమ్మెల్యేగా చంద్రగిరి ప్రజలు ఆదరించారు.. ఆయన కూడా ప్రజలు ఇచ్చిన అధికారాన్ని భయంతో ఎక్కడా ఎవ్వరికీ హాని చేయకుండా అందరికీ మంచి చేశారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అందరికీ అన్ని రకాలుగా అండగా నిలిచారు. ఎవ్వరికి ఏ కష్టం వచ్చినా నేనున్నాను అంటూ నిలబడ్డారు. తండ్రకి తగ్గ తనయునిగా వచ్చే ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు. ప్రజా సేవకై వచ్చిన మోహిత్ ను మీ బిడ్డగా భావించి ఆశీర్వదించండి.. మీ అందరికీ అందుబాటులో ఉండి సేవ చేస్తాడు.. "అంటూ చెవిరెడ్డి లక్ష్మీ ప్రతి గడపలో విజ్ఞప్తి చేశారు.తిరుపతి రూరల్ మండలం పాడిపేట పంచాయతీ శేషాద్రినగర్ ప్రాంతంలో గురువారం గడపగడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామదేవతలకు పూజ చేసిన ఆమె ప్రతి ఇంటికీ వెళ్లి తన బిడ్డ మోహిత్ రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. చెవిరెడ్డి చేసిన సాయం, జగనన్న సంక్షేమ పథకాలు యదావిధిగా కొనసాగాలంటే మరోసారి మోహిత్ రెడ్డికి అవకాశం ఇవ్వాలని కోరారు. గ్రామంలోని మహిళలు ఆమె వెన్నంటి నడుస్తూ స్వచ్ఛందంగా మోహిత్ రెడ్డి విజయానికి తమ మద్దతు తెలియజేశారు. చెవిరెడ్డి బిడ్డను తమ కుటుంబ సభ్యునిగా భావించి తప్పకుండా గెలిపిస్తామని పలువురు వృద్దులు, మహిళలు బహిరంగంగా ఆమెకు మాట ఇచ్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తమ గ్రామంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అందాయని సంతోషం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో మోహిత్ రెడ్డి తప్పకుండా విజయం సాధిస్తారని, అందుకు తమవంతు బాధ్యతగా తాము కూడా ప్రచారంలో పాల్గొంటామని పలువురు యువత చెవిరెడ్డి లక్ష్మీ వెంట నడవడం విశేషం. కులం, మతం, ప్రాంతం, పార్టీ అన్న తేడాలు లేకుండా అందరినీ సమానంగా చూసుకునే చెవిరెడ్డి వంటి నాయకుడు తమకు దొరకడం అదృష్టమని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, పలువురు ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్ర వాలీబాల్ టోర్నమెంట్‌ను పరిశీలించిన కమిషనర్ హరిత

**తిరుపతి, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**



తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో లీలామహాల్, కరకంబాడీ రోడ్డు ప్రక్కన గల మైదానంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను గురువారం తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా గురువారం తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని మహిళలు, పురుషుల క్రీడాకారులకు నగరంలో ఎంపిక చేసిన 29 మైదానాల్లో వాలీబాల్ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. జీవకోన ప్రాంతాల్లోని 8 సచివాలయాల పరిధిలో నమోదు చేసుకున్న క్రీడాకారులకు లీలామహాల్, కరకంబాడీ రోడ్డు ప్రక్కన ఏర్పాటు చేసిన మైదానంలో జరుగుతున్న వాలీబాల్ పోటీలను కమిషన్ పరిశీస్తూ ప్రజలు ఉత్సహంగా పాల్గొంట్టున్నారని తెలిపారు. వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులకు కమిషనర్ హరిత అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ సూపర్డెంట్, క్రీడల కో ఆర్డినేటర్ పి.రవి, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

## ఏడుకొండలను జగన్ కొండలగా మార్చాలని అనుకొంట్టున్నారా....?

- టిటిడి ప్రొసీడింగ్స్‌పై జగన్ బొమ్మ దేనికి ? ...బిజెపి

**తిరుపతి, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**



తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యోగులకు అందిస్తున్న ఇంటి స్థలాల ప్రొసీడింగ్స్ పై ఒకవైపున టిటిడి ఎంబ్లంతో కూడిన వెంకటేశ్వర స్వామి బొమ్మ, మరోవైపున జగన్మోహన్ రెడ్డి బొమ్మను పెట్టి ప్రొసీడింగ్స్ ఇవ్వడం అభ్యంతరకరమని రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి జి భాను ప్రకాష్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. టీటీడీ ఉద్యోగులకు ఇచ్చే ఇళ్ల స్థలాల ప్రొసీడింగ్స్ లోను రాజకీయ పార్టీ నేతల బొమ్మలను ప్రచురించడం తిరుమల తిరుపతి దేవస్థానం చరిత్రలో ఇదే మొదటిసారి అని వ్యాఖ్యానించారు.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ ప్రచార ఖండూతికి ఇది పరాకాష్టగా ఉంది అని రాష్ట్ర బిజెపి కార్యదర్శి ముని సుబ్రహ్మణ్యం అభివర్ణించారు.ఇప్పటివరకు సైన్ బోర్డులు, వైఎస్ఆర్ కిట్లు, జగనన్న విద్యా దీవెన, జగనన్న పథకాలకు తన ఫోటోను తగిలించి సంబరపడిపోతున్న ముఖ్యమంత్రి ఆఖరుకు తిరుమల వెంకటేశ్వర స్వామి తో సమానంగా తన ఫోటోను ముద్రించి ఇవ్వడం హిందు భక్తుల మనోభావాలతో చెలగాట మాడటమేనని అని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ అన్నారు. తక్షణం ప్రొసీడింగ్స్ పై ఫోటోలను తీసి వేయాలని టిటిడి యాజమాన్యానికి బిజెపి అధికార ప్రతినిధి పొనగంటి భాస్కర్ సూచించారు. ఈరోజన తిరుపతి లోగల అలిపిరి వద్ద బిజెపి నిరసన తెలియజేయడం జరిగినది. ఈ సందర్భంగా పోలీసు అధికారులు బిజెపి నాయకులను అక్రమంగా అరెస్టు చేసి అలిపిరి పోలీస్ స్టేషన్లో ఉంచి వ్యక్తిగత పూచీ మీద విడుదల చేయడం జరిగినది.అరెస్ట్ అయిన వారిలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జి భాను ప్రకాష్ రెడ్డి ,బిజెపి రాష్ట్ర కార్యదర్శి ముని సుబ్రహ్మణ్యం, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి చామంచి శ్రీనివాస్, బిజెపి తిరుపతి జిల్లా అధికార ప్రతినిధి పొనగంటి భాస్కర్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి టిడి వరప్రసాద్, మాజీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జల్లి మధుసూదన్, యువ మోర్చా మాజీ జాతీయ నాయకులు పసల సురేష్, ఓబీసీ మోర్చ రాష్ట్ర బిసి వెల్ఫేర్ కో కన్వీనర్ కొండేటి ప్రేమ్ కుమార్, తిరుపతి అసెంబ్లీ కో కన్వీనర్ నాధముని రెడ్డి, యువ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జీవన్ రాయల్, మరియు మండల బిజెపి నాయకులు శరత్ కుమార్, మురళి ,పగడాల ప్రభాకర్, తదితర బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు అరికట్టే నిమిత్తం అవగాహన సదస్సు






**శ్రీకాళహస్తి, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**

బాల్యవివాహాలను అరికట్టే నిమిత్తం ఐసిడిఎస్ మరియు ప్రగతి స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయం నందు సచివాలయ సిబ్బంది, మహిళా పోలీస్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ సభ్యులతో సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మహిళ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ జయలక్ష్మి,సీడీపీఓ శాంతిదుర్గ,రమణ ముఖ్య అతిధులు గా విచ్చేసారు.జయలక్ష్మి మాట్లాడుతు శ్రీకాళహస్తిలో బాల్య వివాహాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున అటువంటి ప్రాంతాలను గుర్తించి బాల్యవివాహాలు చేసే తల్లిదండ్రులకు వాటి వలన కలిగే దుష్ప్రభావాలను వారికి వివరించడానికి అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు అదే విధంగా 2023 బాల్య వివాహాల చట్టం ద్వారా సీఎం పీవోలుగా అదనంగా ఎంపీటీవోలను విద్యాసాకా అధికారులను ఎంఎస్కే లను విలేజ్ సెక్రటరీలను చేర్చడం జరిగిందని వీరందరి ద్వారా గ్రామ గ్రామాన ప్రజలకు బాల్య వివాహాలను అరికట్టకు ప్రణాళికలు సూచనలు సలహాలు అందించడం జరుగుతుందని దాని ద్వారా బాల్య వివాహాలను అరికట్టకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో చందమామల కోటయ్య మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## కాంగోను ముంచెత్తిన వరదలు

కాంగో : కాంగోను భారీ వరదలు ముంచెత్తాయి. మంగళవారం కాసారు సెంట్రల్ ప్రావిన్స్‌లో వరదల ఉధృతికి 22 మంది మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. కాంగోలో భారీ వర్షాలు కురవడంతో నదులు ప్రమాదస్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. వరదల్లో పలువురు గల్లంతయ్యారు. పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడి ఇళ్లు, చర్చ్‌లు, రోడ్లు ధ్వంసమయ్యాయి. కనంగా ప్రాంతంలో గోడలు కూలి పలువురు మృతి చెందినట్లు కనంగా మేయర్ రోస్ మువాది ముసుబే వెల్లడించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ముఖ్యంగా కనంగా ప్రాంతంలో వరదలు బీభత్సం సృష్టించడంతో మృతుల సంఖ్య అక్కడే ఎక్కువగా ఉంది. 25 రోజుల క్రితం బుకావు ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో 14 మంది మరణించిన సంగతి విదితమే.

## ఇరానియన్ మిలిటెంట్ గ్రూప్‌పై అమెరికా ప్రతీకార దాడులు

వాషింగ్టన్: ఇరాన్ మద్దతు గల మిలిటెంట్ గ్రూప్ పై ప్రతీకార దాడులు చేపట్టాలని అధ్యక్షుడు బైడెన్ అమెరికా మిలటరీని సోమవారం ఆదేశించారు. ఇరాన్ మిలిటెంట్ గ్రూప్ కతియాబ్ హిజ్బుల్లా, అనుబంధ సమూహాలు వినియోగించే మూడు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్నట్లు ఓ అధికారి తెలిపారు. ఉత్తర ఇరాక్‌లో జరిగిన డ్రోన్ దాడిలో ముగ్గురు అమెరికా సైనికులు గాయపడినట్లు సమాచారం. సోమవారం తెల్లవారుజామున జరిగిన ఈ దాడిలో అమెరికా సైనికుల్లో ఒకరు తీవ్రంగా గాయపడ్డారని జాతీయ భద్రతా మండలి (ఎన్ఎస్‌సి) ప్రతినిధి అడ్రియన్ వాట్సన్ తెలిపారు. ఇరాన్ మిలిటెంట్ గ్రూప్ కతియాబ్ హిజ్బుల్లా, అనుబంధ సమూహాలు ఈ దాడికి బాధ్యత వహిస్తున్నట్లు ప్రకటించాయి. జాతీయ భద్రతా సలహాదారు జేక్ సుల్లివన్ ఇచ్చిన దాడి సమాచారంతో బైడెన్ ఈ దాడితో అప్రమత్తమయ్యారని, పెంటగాన్, అత్యున్నత అధికారులతో సమావేశం నిర్వహించినట్లు సమాచారం. ఆ సమయంలో బైడెన్ మేరీలాండ్‌లోని క్యాంప్ డేవిడ్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గన్నట్లు తెలుస్తోంది. బైడెన్ జాతీయ భద్రతా డిప్యూటీ సలహాదారు జోన్ ఫైనర్ కూడా అధ్యక్షుడితో ఉన్నట్లు సమాచారం. జేక్ సుల్లివన్, డిఫెన్స్ సెక్రటరీ లాయిడ్ ఆస్టిన్‌తో సంప్రదింపులు జరిపారు.

## ప్రమాదంలో.. "చంద్రగిరి' భవిష్యత్తు...!!

- మేల్కోనొకపోతే 20 ఏళ్లు వెనక్కి...!!
- ఈ ప్రభుత్వాన్ని సాగనంపాల్సిందే...ప్రజల తీర్పు

**చంద్రగిరి, డిసెంబర్ 28 (శ్రీచక్ర) :**



వైసీపీ పాలనలో చంద్రగిరి భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిపోయిందని, నియోజకవర్గంలోని అన్ని వ్యవస్థలు ప్రమాదంలో ఉన్నాయని చిత్తూరు జిల్లా పార్లమెంటరీ అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి అన్నారు.. "మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని"' "బాబు ఘరిటి భవిష్యత్తుకు గ్యారెంటీ" కార్యక్రమంలో భాగంగా గురువారం ఆమె చంద్రగిరి పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా మండల నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఆమె ఇంటింటికి తిరిగి ఆర్టీసీ, విద్యుత చార్జీల పెంపు, రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న అరాచక పాలన, ప్రభుత్వ వైఫల్యాల గురించి ప్రజలకు తెలియజేశారు.

**మేల్కోనొకపోతే 20 ఏళ్లు వెనక్కి..**

ఇప్పటికే నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందని ఇకనైనా మేల్కోనొకపోతే మరో 20 ఏళ్లు వెనుకబడి పోతామని పులివర్తి సుధారెడ్డి చెప్పారు. నాలుగు పదవులు ఇచ్చింది నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికా లేక వ్యక్తిగతంగా లబ్ధి పొందడానికా అని ప్రశ్నించారు. కనీసం నాయకులు, కార్యకర్తలు అయినా గుర్తున్నారా...? అని ప్రశ్నించారు. కొందరు సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు ప్రజలకు సమాధానం చెప్పలేక ఇళ్లు కదలడం లేదని ఆరోపించారు. ఎంపీపీ'లు, జెడ్పీటీసీ'ల మానసిక క్షోభ వర్ణనాతీతం అన్నారు.

**ఈ ప్రభుత్వాన్ని సాగనంపాల్సిందే..**

ఓ పక్క దాడులు, దౌర్జన్యాలు, మరోపక్క ధరల బాదుడుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పులివర్తి సుధారెడ్డి పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని ఇక సాగనంపాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ అవసరాలకు, ప్రజల సౌకర్యాలకు సెంటు భూమి కూడా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా స్మశాన వాటికలు లేని గ్రామాల పరిస్థితి.. అభివృద్ధికి అద్దం పడుతున్నాయని వెల్లడించారు. పులివర్తి నానికి అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని రోల్ మోడల్ గా నిలుపుతారాని ఆమె ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## గాజాలో మానవీయ సంక్షోభం

గాజా: గాజాలో అయిదు లక్షల మంది కంటే ఎక్కువ మంది అంటే జనాభాలో నాలుగింట ఒక వంతు మంది ఆకలితో అలమటిస్తున్నారు. అక్టోబర్ 7 నుంచి గాజాపై ఇజ్రాయెల్ సాగిస్తున్న బాంబు దాడులు, ముట్టడి అక్కడ మానవతా సంక్షోభాన్ని ఎత్తి చూపుతోంది. పాలస్తీనియన్ల మరణాల సంఖ్య ఇప్పుడు 20,000కి చేరుకుందని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. నివేదికలోని గణాంకాల ప్రకారం, ఇటీవలి సంవత్సరాలలో ఆఫ్ఘనిస్తాన్, యెమెన్‌లలోని క్షామం కన్నా ఇది తీవ్రమైనది. కరువు ప్రమాదం "ప్రతిరోజూ పెరుగుతోంది" అని నివేదిక హెచ్చరించింది, గాజాలోకి తగినంత సహాయం అందకపోవడంతో ఆకలి రక్కసి కోరలు చాస్తోంది. ఇది మరింత దిగజారే ప్రమాదముందని ఐరాస ప్రపంచ ఆహార కార్యక్రమం ప్రధాన ఆర్థికవేత్త ఆరిఫ్ హుస్సేన్ హెచ్చరించారు. "గాజాలో ఇంత దారుణమైన మానవీయ సంక్షోభాన్ని ఇదివరకెన్నడూ చూడలేదని ఆయన అన్నారు. యుద్ధం కారణంగా గూడు చెదిరిన పక్షుల్లా వలస బాట పట్టిన అయా బర్బఖ్, తాను ప్రతిరోజూ ఆహారం కోసం వస్తానని చెప్పింది.ఇతరుల మాదిరిగానే మమ్మల్ని బతకనివ్వండి. రోజూ చనిపోతున్న మనుషులను చూస్తుంటాం, వాళ్లలాగే చనిపోవాలని అనుకుంటాం. మమ్మల్ని అవమానించారు అని ఆమె అన్నారు.వంటగదిని నిర్వహించే ఓ స్వచ్ఛంద సంస్థకు చెందిన మహమూద్ అల్-కిషావి మాట్లాడుతూ, వంట చేయడానికి ఇంధనం లేదని, కాబట్టి వారు కలపను కాల్చడానికి చుట్టుపక్కల వెతకవలసి ఉంటుందని చెప్పారు.పెద్ద సంఖ్యలో కుటుంబాలు ఉన్నాయి మరియు వారికి తగినంత ఆహారం మా వద్ద లేదు అని కిషావి వాపోయారు. ఇజ్రాయెల్‌కు మిగిలి ఉన్న కొద్దిమంది మిత్రదేశాలలో ఒకటైన అమెరికా కాల్పుల విరమణపై పట్టుబట్టడంలో విఫలమైందని గాజాలో ఆకలి తీవ్రతపై గురువారం నాటి నివేదిక నొక్కి చెప్పింది.

## పాలస్తీనా ఖైదీలపై చిత్ర హింసలు

గాజా: ఇజ్రాయెల్ దళాలు గాజాలోని పాలస్తీనా పౌరులను వారి కుటుంబాల ఎదుటే ఉరితీస్తున్నాయని, అంతర్జాతీయ యుద్ధ నియమాలను, మానవ హక్కులను బాహాటంగా ఉల్లంఘిస్తూ ఖైదీలను బహిరంగ నిర్బంధ శిబిరాల్లో పెడుతున్నాయి. పాలస్తీనియన్ ఖైదీలను రక రకాల హింసా పద్ధతులను ప్రయోగిస్తున్న వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. అనేక మీడియా ఛానెళ్లు గత వారం విడుదల చేసిన వీడియో ఫుటేజ్, ఇజ్రాయెల్ దళాలు డజన్ల కొద్దీ పాలస్తీనియన్ ఖైదీలను బహిరంగ మైదానంలో (స్పష్టంగా ఒక స్టేడియం) బట్టలూడదీసి నగంగా కూర్చోబెట్టడాన్ని చూపించాయి. పాలస్తీనా ఖైదీల్లో చిన్నారులు, పసిపిల్లలు కూడా ఉన్నట్లు స్పష్టమవుతోంది. డిసెంబర్ 7న, ఒక ఇజ్రాయెల్ టీవీ ఛానెల్‌లో ఇలాంటి వీడియోలు ఫోటోల సెట్ ప్రసారం చేయబడింది, దీనిలో డజన్ల కొద్దీ పురుషులు తమ లోదుస్తులను తొలగించి వీధి మధ్యలో కూర్చోవడం లేదా ఇజ్రాయెల్ దళాలు ట్రక్కులో తీసుకెళ్లడం కనిపించింది.



## సరిపోదా శనివారంలో కొత్త లుక్‌లో నాని

హీరో నాని, దర్శకుడు వివేక్ ఆత్రేయ రెండో సారి కలసి పని చేస్తున్న 'సరిపోదా శనివారం' చిత్రం తాజా షెడ్యూల్ బుధవారం మొదలైంది. ఈ చిత్రంలో నాని పూర్తి స్థాయి యాక్షన్ పాత్ర పోషిస్తున్నారు. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'గత నెలలో ఒక షెడ్యూల్ పూర్తి చేశాం. బుధవారం నుంచి కొత్త షెడ్యూల్ ప్రారంభించాం. లెంగ్తీ షెడ్యూల్ ఇది. యాక్షన్ ఎపిసోడ్స్‌తో పాటు ప్రధాన తారాగణం పాల్గొనగా కొంత టాకీ పార్ట్ కూడా చిత్రీకరిస్తాం. ఈ సినిమాలో నాని రగ్గడ్ లుక్‌లో కనిపించి, అందరినీ అలరిస్తారు' అని నిర్మాతలు చెప్పారు. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఎస్.జె.సూర్య కీలక పాత్ర పోషిస్తున్నారు. జేక్స్ బిజోయ్ సంగీతాన్ని సమకూరుస్తుండగా, మురళీ జి సినిమాటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు.




**తదుపరి షెడ్యూల్ మొదలు పెట్టిన శంకర్**

టాలీవుడ్ స్టార్ యాక్టర్ రాంచరణ్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం గేమ్‌ఛేంజర్ స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. పొలిటికల్ థ్రిల్లర్ జోనర్‌లో వస్తోన్న గేమ్ ఛేంజర్ షూటింగ్ దశలో ఉంది. కాగా ఎప్పుడూ ఏదో ఒక అప్‌డేట్ నెట్టింట హల్ చల్ చేస్తూనే ఉంది. లేటెస్ట్ షూటింగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. తాజా సమాచారం ప్రకారం గేమ్ ఛేంజర్ నయా షెడ్యూల్ షూటింగ్ నేడు హైదరాబాద్‌లో షురూ అయింది. శ్రీకాంత్, సముద్రఖని, ఎస్‌జే సూర్య ఇతర నటీనటులపై వచ్చే సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారని టాక్.. కాగా రాంచరణ్ త్వరలోనే సెట్స్‌లో జాయిన్ కాబోతున్నాడట. గేమ్‌ఛేంజర్‌లో రాజోలు భామ అంజలి, బాలీవుడ్ నటుడు హ్యారీ జోష్, ఎస్‌జే సూర్య, నవీన్ చంద్ర, శ్రీకాంత్, సముద్రఖని, జయరాయ్, సునీల్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని భారీ బ్జడెట్, హై టెక్నికల్ వాల్యూస్‌తో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు తెరకెక్కిస్తున్నారు. గేమ్ ఛేంజర్‌కు పాపులర్ డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజు కథనందిస్తుండగా.. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్ అందిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానున్న ఈ చిత్రానికి ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నాడు. రాంచరణ్ మరోవైపు ఉప్పెన ఫేం బుచ్చిబాబు సాన డైరెక్షన్‌లో ఆర్‌సీ 16కు కూడా ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఈ మూవీలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో సాయిపల్లవిని తీసుకున్నట్టు వార్తలు వస్తుండగా.. రాంచరణ్ టీం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.




## ఈగిల్ నుంచి ఎండో పాట విడుదల

టాలీవుడ్ హీరో రవితేజ కాంపౌండ్ నుంచి వస్తున్న తాజా చిత్రం ఈగల్ కార్తీక్ ఘట్టమనేని డైరెక్ట్ చేస్తున్నాడు. అనుపమ పరమేశ్వరన్ , కావ్య థాపర్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా ఏదో ఒక అప్‌డేట్ అందిస్తున్నారు టీం మెంబర్స్. ఈగల్ నుంచి సెకండ్ సింగిల్ అప్‌డేట్ అందించారు. తాజాగా మేకర్స్ ఈగల్ నుంచి గల్లంతే గల్లంతే అంటూ సాగే రెండో పాటను మేకర్స్ లాంఛ్ చేశారు. రవితేజ, కావ్యథాపర్ మధ్య వచ్చే ఈ సాంగ్ ఫీల్ గుడ్ మెలోడీ ట్రాక్‌తో మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేసేలా సాగుతుంది. ఇప్పటికే లాంఛ్ చేసిన ఎజిటబీఓజీఈరజీ లిరికల్ వీడియో సాంగ్ ఊరమాస్ స్టెప్పులతో సాగుతూ అభిమానులు, మూవీ లవర్స్‌ను ఫుల్ ఎంటర్‌టైన్ చేస్తోంది. ఈగల్‌లో నవదీప్, శ్రీనివాస్ అవసరాల, మధుబాల కీలక పాత్రలు పోషిస్తున్నారు. మేకర్స్ ఇప్పటికే లాంఛ్ చేసిన ఈగల్ పోస్టర్లు, స్టైలిష్ లుక్, ట్రైలర్ అప్‌డేట్ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ.. సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేస్తున్నాయి. విషం మింగుతాను.. విశ్వం తిరుగుతాను.. ఊపిరి ఊదుతాను.. కాపలా అవుతాను.. విధ్వంసం నేను.. విధ్వంసాన్ని ఆపే వినాశనం నేను.. అంటూ ట్రైలర్‌లో మాస్ మహారాజా రవితేజ స్టైల్‌లో సాగుతున్న మార్క్ డైలాగ్స్ అంచనాలు అమాంతం పెంచేస్తున్నాయి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు.

## విజయ్‌కాంత్ మృతికి టాలీవుడ్ దిగ్భ్రాంతి

**చిరు, పవన్ కళ్యాణ్, మోహన్‌బాబుల సంతాపం**

డీఎండీకే అధ్యక్షుడు, సినీ నటుడు విజయకాంత్ మరణం వార్తతో కోలీవుడ్‌తోపాటు సౌత్ సినిమా ఇండస్ట్రీ తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. సినీలోకం కెప్టెన్ అని పిలుచుకునే మనిషి దూరమయ్యాడంటూ కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ మేరకు పలు సినీ సెలబ్రిటీలు విజయకాంత్ కు సోషల్ మీడియా వేదికగా నివాళులు అర్పిస్తున్నారు. 'మన 'పురట్చి కలైంగర్', 'కెప్టెన్' విజయకాంత్ ఇకలేరని తెలిసి గుండె బద్దలైనట్టయింది. ఆయన గొప్ప వ్యక్తి. మాస్ హీరో. మంచి వ్యక్తిత్వం ఉన్న మనిషి. తెలివైన రాజకీయ నాయకుడు. డైరెక్ట్‌గా తెలుగు చిత్రాల్లో నటించనప్పటికీ ఇక్కడ కూడా ఎంతోమంది సినీ ప్రేమికుల ప్రేమను పొందారు. ఇప్పుడు తిరిగిరాని లోకాలకు వెళ్లి శూన్యాన్ని మిగిల్చారు. ఆయన అభిమానులకు, కుటుంబ సభ్యులకు నా సానుభూతి తెలుపుతున్నా. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నా' అని చిరంజీవి ట్వీట్ చేశారు. విజయకాంత్ గారు కన్నుమూశారని తెలిసి చింతిస్తున్నాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. కుటుంబ కథాంశాలతోపాటు సామాజిక, అంశాల మేళవింపుతో యాక్షన్ చిత్రాలు ఎక్కువ చేశారు. ఆపదలో ఉన్న వారిపట్ల మానవతా దృక్పథంతో స్పందించేవారు. ఆయనకు తొలి అడుగులో ఎదురైన ఫలితానికి అధైర్యపడక రాజకీయాల్లో నిలబడ్డారు. ఆయనకు సినీ సహచరుల నుంచి అవమానాలు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. ఆ తత్వంతోనే తమిళనాడు అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ప్రజల పక్షం వహించారు. విజయకాంత్ గారిని చివరిసారి 2014లో పార్లమెంట్ సెంట్రల్ హాల్లో కలిశాను. తమిళనాడు రాష్ట్రానికి ముఖ్యమంత్రి కాదగ్గ నాయకుడు అని ఎందరో భావించారు. ఆరోగ్యం క్రమంగా క్షీణించడంతో తుదిశ్వాస విడిచారు. ఆయన రాజకీయ వారసత్వాన్ని ఆయన సతీమణి శ్రీమతి ప్రేమలత గారు కొనసాగిస్తారని ఆశిస్తున్నానని పవన్ కల్యాణ్ నివాళి అర్పించారు. 'నా మిత్రుడు, దిగ్గజ నటుడు విజయకాంత్ మృతి చెందడం బాధాకరం. చెన్నైలో ఉన్నప్పుడు ఆయనతో లెక్కలేనన్ని క్షణాలు గడిపాను. ఎంతో స్నేహంగా ఉండేవాళ్లం. ఆయనతో బంధం నా జీవితంలో ఓ ముఖ్యమైన భాగం. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని నటుడు, నిర్మాత డాక్టర్ మోహన్‌బాబు తెలిపారు. విజయకాంత్ గారి మరణం విచారకరం. ఆయన జ్ఞాపకాలతో ఆయన కుటుంబసభ్యులు సాంత్వన పొందాలని , భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నట్లు నటుడు రవితేజ తెలిపారు. నా మొదటి సినిమానే విజయకాంత్‌తో కలిసి నటించే అవకాశం రావడం నా అదృష్టం. ఎన్నో సలహాలిచ్చారు. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటానని నటుడు సోనుసూద్ తెలిపారు.

## వైసిపిపైనా సినిమా తీస్తా.. నట్టికుమార్ ప్రకటన

రామ్‌గోపాల్ వర్మ ఒక డైరెక్టర్ అని.. వైసీపీ వాళ్లు డబ్బులిస్తే వ్యూహం సినిమా తీశాడని సినీ నిర్మాత కమ్ డైరెక్టర్ నట్టి కుమార్ పేర్కొన్నారు. డబ్బులిచ్చారు కాబట్టి వైసీపీపై వర్మకు సానుభూతి ఉంటుందన్నారు. కానీ సినిమాలు చూసి ప్రజలు ఓట్లు వేసే రోజులు పోయాయన్నారు. వ్యూహం సినిమా తాను చూస్తానని.. వెంటనే వైసీపీకి వ్యతిరేకంగా సినిమా తీస్తానని నట్టి కుమార్ తెలిపారు. ఎంపీ రఘురామ కృష్ణరాజుకు చిత్ర హింసలు, వివేకానందరెడ్డి మర్డర్ ఎలా జరిగింది? వైసీపీ అరాచకాలపై నేను సినిమాలు తీసి సమాధానం చెబుతా. వివేకానంద మర్డర్ ఎందుకు చేశారో చెప్పలేని పరిస్థితుల్లో ఏపీ ప్రభుత్వం ఎందుకు ఉంది. సినీ పరిశ్రమ మొత్తం టీడీపీ వైపు ఉంది. ప్రస్తుతం సినీ రంగం భయంతో ఉంది. త్వరలో టీడీపీకి మద్దతుగా అందరూ వస్తారు. రాష్ట్ర ప్రజల బాగు కోసం నేను టీడీపీకి సపోర్ట్ చేస్తున్నా. చంద్రబాబుని త్వరలో కలిసి నా ప్రత్యక్ష రాజకీయాలపై కార్యచరణ ప్రకటిస్తా. విశాఖలో సినీ రంగానికి ప్రభుత్వ స్టూడియో నిర్మాణం కావాలని లోకేష్ గారిని అడిగాను. సినిమా హబ్ గా విశాఖను తీసుకువస్తాం. టీడీపీ, జనసేనకి 130 నుంచి 150 సీట్లు వస్తాయి. వైసీపీ 29 సీట్లకు పరిమితమవుతుంది.

## విజయకాంత్ మృతితో కోలీవుడ్‌లో విషాదం

**మార్నింగ్ షోలు రద్దు చేసిన థియేటర్లు**



తమిళ నటుడు, డీఎండీకే అధినేత కెప్టెన్ విజయకాంత్ మృతితో కోలీవుడ్‌లో విషాదం అలముకుంది. శ్వాస సంబంధిత సమస్యతో చెన్నైలోని మియోట్ దవాఖానలో చేరగా.. కొవిడ్ నిర్ధారణ అయింది. ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండటంతో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తుండగా.. విజయకాంత్ తుదిశ్వాస విడిచారు. నటుడిగా, రాజకీయవేత్తగా ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్న విజయ్ కాంత్ మృతి పట్ల యావత్ తమిళ ప్రజలతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. విజయకాంత్ మృతికి సంతాపంగా తమిళనాడు వ్యాప్తంగా థియేటర్లలో మార్నింగ్ షోలను రద్దు చేశారు. కెప్టెన్ విజయకాంత్ సార్ మనల్ని విడిచి వెళ్లిన నేపథ్యంలో సంతాపంగా మార్నింగ్ షో రద్దు చేశామని, రెగ్యులర్ షోలను మధ్యాహ్నం 2:30 గంటల నుంచి షురూ చేస్తామని థియేటర్ల యాజమాన్యాలు ప్రకటించాయి. 71 ఏండ్ల విజయకాంత్ ఏడాది కాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. నవంబర్ 18న జలుబు, దగ్గు, గొంతునొప్పి వంటి సమస్యలతో చెన్నైలోని మియోట్ దవాఖానలో చేరారు. చికిత్స అనంతరం కోలుకుని డిసెంబర్ 11న ఇంటికి చేరుకున్నారు. అయితే రెండు వారాలు గడువకముందే ఆయన కొవిడ్ బారినపడటం, మరోసారి శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తగా పరిస్థితి విషమించడంతో ఉదయం తుదిశ్వాస విడిచారు. తమిళ సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన విజయకాంత్.. ఆ తర్వాత ఆయన రాజకీయాల్లో సైతం అడుగుపెట్టారు. 2005లో డీఎండీకే పార్టీని స్థాపించారు.

Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940**, e-mail: **sreechakratelugu@gmail.com**.